రోజంతా పంచమి ప్రభావం ఉంటుందన్న టీటీడీ

తిరుచానూరుకు భారీగా చేరుకున్న భక్తులు

నేటి రాత్రి ధ్వజావరోహణంతో ముగియనున్న బ్రహ్మోత్సవాలు









సోమవారం రాత్రే హోల్డింగ్ పాయింట్‌కు చేరుకున్న భక్తులు

నేడే పంచమి తీర్థం

● మధ్యాహ్నం 12.10 గంటలకు చక్రస్నానం

అశ్వ వాహనంపై కల్కిగా.. : చెర్నాకోలు చేతపట్టి.. అశ్వ వాహనంపై కల్కి రూపంలో పద్మావతీ దేవి భక్తులను కటాక్షించారు. తిరుచానూరు అమ్మవారి కార్తీక బ్రహ్మోత్సవాల్లో సోమవారం రాత్రి అమ్మవారు అశ్వవాహనంపై మాడవీధుల్లో ఊరేగారు. దీంతో ఈనెల 17న రాత్రి చిన్నశేషుడితో మొదలైన అమ్మవారి వాహన సేవలు ముగిశాయి. గడిచిన ఎనిమిది రోజుల్లో 16 వాహనాలపై వివిధ రూపాల్లో అమ్మవారు మాడవీధుల్లో ఊరేగారు. ఆయా కార్యక్రమాల్లో జీయర్ స్వాములు, టీటీడీ ఈవో అనిల్‌కుమార్ సింఘాల్, బోర్డు సభ్యులు పనబాక లక్ష్మి, జానకిదేవి, శాంతారాం, నరేష్‌కుమార్, జేఈవో వీరబ్రహ్మం, ఆలయ డిప్యూటీ ఈవో హరీందర్‌నాథ్, ఏఈవో దేవరాజులు, ఏవీఎస్వో రాధాకృష్ణమూర్తి, అర్చకులు శ్రీనివాసాచార్యులు, బాబుస్వామి, మణికంఠస్వామి, సూపరింటెండెంట్లు రమేష్, టెంపుల్ ఇన్‌స్పెక్టర్ ప్రసాద్, చలపతి, సుబ్బరాయుడు సుభాస్కర్‌నాయుడు తదితరులు పాల్గొన్నారు.



అశ్వ వాహనంపై ఊరేగుతున్న అమ్మవారిని దర్శించుకుంటున్న భక్తులు

బ్రహ్మోత్సవాల్లో నేడు
మధ్యాహ్నం 12.10 గంటలు: పద్మసరోవరంలో చక్రస్నానం
రాత్రి 9.30 గంటలు: ధ్వజావరోహణం

తిరుచానూరు, నవంబరు 24(ఆంధ్రజ్యోతి): తిరుచానూరు పద్మావతి అమ్మవారి కార్తీక బ్రహ్మోత్సవాల్లో చివరి ఘట్టమైన పంచమితీర్థం (చక్రస్నానం) మంగళవారం జరగనుంది. ఉదయం అమ్మవారి ఉత్సవమూర్తిని, చక్రత్తాళ్వార్‌ను ఆలయం నుంచి వేంచేపుగా పంచమితీర్థం మండపానికి తీసుకురానున్నారు. పది గంటలకు స్నపన తిరుమంజనం నిర్వహిస్తారు. మధ్యాహ్నం 12.10 గంటలకు.. అభిజిత్ కుంభ లగ్నంలో చక్రత్తాళ్వార్‌ను అర్చకులు పుష్కరిణిలో మునక వేయించనున్నారు. ఆ తర్వాత భక్తులు పుష్కరిణి స్నానాలను ఆచరించనున్నారు. లక్ష మందికిపైగా భక్తులు పుష్కర స్నానం చేయనున్నారు. తదనుగుణంగా టీటీడీ ఏర్పాట్లు చేపట్టింది. చక్రస్నానం జరిగే ప్రాంతంలో స్టీల్‌తో గ్రిల్స్ అమర్చారు. వీవీఐపీలకు, వీఐపీలకు, మీడియాకు ప్రత్యేక గ్యాలరీలు ఏర్పాటు చేశారు. చక్రస్నానానికి వచ్చే భక్తులకు అల్పాహారం, పాలు, బిస్కెట్లను టీటీడీ అందించనుంది. రోజంతా పంచమి ప్రభావం ఉంటుందని, భక్తులు సంయమనంతో పుష్కర స్నానం ఆచరించాలని టీటీడీ విజ్ఞప్తి చేసింది. మంగళవారం రాత్రి జరిగే ధ్వజావరోహణంతో బ్రహ్మోత్సవాలు ముగియనున్నాయి.

హోల్డింగ్ పాయింట్‌కొస్తేనే పుష్కరిణికి..

తిరుపతి నుంచి వచ్చే వారికి నవజీవన్ ఆస్పత్రి వద్ద. పూడి నుంచి వచ్చేవారికి స్వర్ణముఖినది ఒడ్డున గోశాల వద్ద. మరొకటి జడ్పీ హైస్కూల్ వద్ద హోల్డింగ్ పాయింట్లు ఏర్పాటు చేశారు. ఈ హోల్డింగ్ పాయింట్ల నుంచే పుష్కరిణి స్నానాలకు అనుమతిస్తారు. ప్రతి హోల్డింగ్ పాయింట్ నుంచి వచ్చే క్యూలైన్లను గేట్ నెంబరు 4కు అనుసంధానం చేశారు. అక్కడ్నుంచి పుష్కరిణిలోకి భక్తులను వదులుతారు. కాగా, సోమవారం రాత్రికే భక్తులు భారీ ఎత్తున హోల్డింగ్ పాయింట్లకు చేరుకున్నారు. వీరిని మంగళవారం ఉదయం 10గంటలకుపైగా పుష్కరిణిలోకి అనుమతించనున్నారు.

పార్కింగ్ కేంద్రాలు

పంచమి తీర్థానికి వచ్చే భక్తులకు శిల్పారామం, మార్కెట్‌యార్డు, తనపల్లి రోడ్డు, నారాయణాద్రి ఆస్పత్రిరోడ్డు, ముండ్లపూడి వద్ద పార్కింగ్‌కేంద్రాలను ఏర్పాటు చేశారు. భక్తులు తమ వాహనాలను అక్కడ ఆపి హోల్డింగ్ పాయింట్లకు చేరుకోవాలి. ఇక సోమవారం రాత్రి 10గంటల నుంచి మంగళవారం సాయంత్రం వరకు తిరుచానూరులోకి వాహనాలను అనుమతించడం లేదు.

పుష్కరిణి చుట్టూ పటిష్ఠ నిఘా

పంచమితీర్థం సందర్భంగా దాదాపు రెండు వేల మందితో పోలీసుశాఖ భారీ బందోబస్తు ఏర్పాటుచేసింది. పుష్కరిణి, ఆలయ పరిసరాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసి కమాండ్ కంట్రోల్ రూమ్‌కు అనుసంధానం చేశారు. కమాండ్ కంట్రోల్ రూమ్ నుంచి ఆలయం, పుష్కరణి పరిసరాలను పరిశీలించడానికి ప్రత్యేక సిబ్బందిని నియమించారు. ఎక్కడైనా సమస్య తలెత్తితే వైర్‌లెస్ సెట్ ద్వారా పోలీసులను అప్రమత్తం చేస్తారు.

రైతన్నా.. మీకోసం

ఇంటింటికీ వెళ్లి పథకాలను వివరించిన కలెక్టర్



గాజులమండ్యంలో రైతులతో మాట్లాడుతున్న కలెక్టర్

రేణిగుంట, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): 'రైతన్నా.. మీకోసం' కార్యక్రమంలో భాగంగా సోమవారం రేణిగుంట మండలం గాజులమండ్యంలో కలెక్టర్ వెంకటేశ్వర్ పాల్గొన్నారు. గ్రామంలోని ప్రతి రైతు ఇంటికి వెళ్లి ప్రభుత్వ పథకాలను వివరించారు. రైతు సంక్షేమం, వ్యవసాయ అభివృద్ధే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం గత ఒకటిన్నర సంవత్సరంలో పలు పథకాలు అమలు చేసిందని గుర్తుచేశారు. ప్రతి పథకం రైతు ఇంటి వద్దకు చేరేలా ఈనెల 29వ తేదీ వరకు గ్రామ సచివాలయ సిబ్బంది అవగాహన కల్పిస్తారన్నారు. జిల్లాలో 20 వేల టన్నుల యూరియా అందుబాటులో ఉండగా, ఇప్పటివరకు 12,500 టన్నులు పంపిణీ చేశామన్నారు. కనీసం మద్దతు ధర కంటే తక్కువకే ధాన్యం విక్రయించాల్సిన పరిస్థితి రాకుండా ప్రతి గింజను ప్రభుత్వమే కొంటుందన్నారు. ఈ ఏడాది వర్షాలు బాగా కురిసినందున రెండు పంటలు వేసుకునే అవకాశం ఉందన్నారు. కూలీల కొరతను తగ్గించేందుకు సీహెచ్‌సీల ద్వారా తక్కువ ఖర్చుతో యంత్రాలను అందుబాటులోకి తెచ్చామన్నారు. డ్రోన్ సాయంతో ఎకరాకు 6నిమిషాల్లో ఎరువుల పిచికారీ పూర్తి చేయవచ్చన్నారు. మామిడి, వేరుశనగ పంటలకు డ్రిప్, స్ప్రింక్లర్లను రాయితీపై అందిస్తున్నామన్నారు. ఏ పంట వేసేదీ ప్రతి రైతు ఫార్మర్ రిజిస్ట్రర్లో నమోదు చేసి పంట బుకింగ్ వ్యవస్థను బలోపేతం చేశామన్నారు. ఆర్డీవోలు భానుప్రకాష్‌రెడ్డి, ప్రసాదరావు, ఏవో సునీల్‌కుమార్‌రెడ్డి, తహసీల్దార్ చంద్రశేఖర్ రెడ్డి, రెవెన్యూ, మత్స్య శాఖ, సిబ్బంది, స్థానిక టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

సమస్యలపై అధ్యయనానికి
ప్రత్యేక బృందాలు

● సదరన్ డిస్కం సీఎండీ శివశంకర్





విద్యుత్ వినియోగదారుల సమస్యలను వింటున్న సీఎండీ


తిరుపతి(ఆటోనగర్), నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): 'లో ఓల్టేజ్.. విద్యుత్ సరఫరాలో అంతరాయాలు వస్తున్నాయని వినియోగదారుల నుంచి ఎక్కువగా ఫిర్యాదులు వచ్చాయి. వీటిపై సాంకేతిక సమస్యలను అధ్యయనం చేసి పరిష్కరించడానికి ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేశాం' అని సదరన్ డిస్కం సీఎండీ శివశంకర్ తెలిపారు. తిరుపతిలోని సదరన్ డిస్కం కార్యాలయంలో సోమవారం ఉదయం 10 నుంచి 12 గంటల వరకు డయల్ యువర్ సీఎండీ కార్యక్రమాన్ని నిర్వహించారు. డిస్కం పరిధిలోని 65 మంది వినియోగదారుల నుంచి ఫిర్యాదులు వచ్చాయన్నారు. క్షేత్ర స్థాయిలో వినియోగదారుల సమస్యలు పరిష్కరించడంలో సిబ్బంది నిర్లక్ష్యం జరుగుతోందని, అనతికాలంలో పరిష్కరించేలా చర్యలు తీసుకొంటామని ఆయన చెప్పారు. డయల్ యువర్ సీఎండీ కార్యక్రమంలో తమ దృష్టికి వచ్చే చిన్న సమస్యలతో పాటు పెద్దవీ త్వరితగతిన పరిష్కారమవుతున్నాయని చెప్పారు. సీజీఎంలు, జీఎంలు నోడల్ అధికారులుగా వ్యవహరిస్తారని ఆయన తెలిపారు. గ్రామీణ ప్రాంతాల్లో దీర్ఘకాలంగా పరిష్కారం కాని సమస్యలను తన దృష్టికి తెస్తే, తగిన ప్రాధాన్యమిచ్చి, వీలైనంత త్వరగా పరిష్కరించడానికి చర్యలు తీసుకుంటామని చెప్పారు. ఇప్పటి వరకు వచ్చిన సమస్యల్లో, సాంకేతిక పరమైన సమస్యలు మినహా మిగిలినవి పరిష్కరించామన్నారు. వినియోగదారుల సమస్యలను పరిష్కరించడంలో అధికారులు, ఉద్యోగులు, సిబ్బంది నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని సీఎండీ హెచ్చరించారు. విద్యుత్ వినియోగదారులు తమ సమస్యలను టోల్ ఫ్రీ నెంబర్లు 1912, 1800 425155333 కి డయల్ చేసి... 91333 31912 నెంబరుకు చాట్ చేస్తే సమస్యలను పరిష్కరిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో డైరెక్టర్లు కె. గురవయ్య, పి.అయూబ్‌ఖాన్, కె.రామమోహనరావు, చీఫ్ జనరల్ మేనేజర్లు జె.రమణాదేవి, పి.హెచ్.జానకిరామ్, ఎం.మురళీకుమార్, పి.సురేంద్ర నాయుడు, కె.ఆదిశేషయ్య, ఎం.ఉమాపతి, జీఎంలు ఎం.కృష్ణారెడ్డి, రామచంద్ర రావు, జి.చక్రపాణి, డి.సురేంద్రరావు, పి.భాస్కర్‌రెడ్డి, విజయన్, జగదీష్ పాల్గొన్నారు.

సింగపూర్ పర్యటనకు
ముగ్గురు ఉపాధ్యాయులు

తిరుపతి(విద్య), నవంబరు 24(ఆంధ్రజ్యోతి): ఉత్తమ ఉపాధ్యాయులుగా రాష్ట్ర పురస్కారాలు అందుకున్న ముగ్గురు ఉపాధ్యాయులు సింగపూర్ పర్యటనకు వెళ్లనున్నారు. సింగపూర్ విద్యావ్యవస్థ ప్రపంచ స్థాయిలో ఉత్తమ విద్యావ్యవస్థగా గుర్తింపు పొందింది. ఈ నేపథ్యంలో సింగపూర్‌లో అత్యుత్తమ విద్యావిధానాలను అధ్యయనంచేసి... వాటిని మన రాష్ట్రంలోకూడా అమలుచేసి మన విద్యావ్యవస్థను మరింత మెరుగుగా తీర్చిదిద్దాలనే లక్ష్యంతో ప్రభుత్వం ఉత్తమ ఉపాధ్యాయులను సింగపూర్ పంపిస్తోంది. ఈ క్రమంలో శ్రీకాళహస్తి మండలం ముచ్చివోలు జడ్పీహెచ్‌ఎస్ ఫిజికల్ సైన్స్ స్కూల్ అసిస్టెంట్ డాక్టర్ ఎన్.సుబ్రమణ్యశర్మ, తొట్టంబేడు మండలం దిగువ సాంబయ్యపాళెం ఫౌండేషన్ స్కూల్ సెకండరీ గ్రేడ్ టీచర్ కయ్యూరు బాలసుబ్రమణ్యం, శ్రీకాళహస్తి మండలం ఎగువ వీధి జడ్పీహెచ్‌ఎస్ ఫిజికల్ ఎడ్యుకేషన్ టీచర్ ఎస్.రామకృష్ణ సింగపూర్ వెళ్లేవారిలో ఉన్నారు. ఈనెల 27 నుంచి డిసెంబరు 2వ తేదీ వరకు వీరి పర్యటన కొనసాగనుంది. సింగపూర్‌లోని ప్రధాన పాఠశాలల్లో అత్యాధునిక బోధనా విధానాలు, క్లాస్‌రూమ్ వాతరావరణం, టెక్నాలజీ ఆధారిత బోధనా విధానాలు, బోధనేతర పద్ధతులు, కరిక్యులం, తరగతి గదుల్లో విద్యార్థులు, ఉపాధ్యాయుల మధ్య అనుబంధం తదితర అంశాలను పరిశీలించి తదుపరి ఆయా అంశాల గురించి, రాష్ట్రంలో ఆయా విధానాలను ఎలా అమలు చేయొచ్చన్న దానిపై ప్రభుత్వానికి నివేదిక సమర్పించనున్నారు.







డాక్టర్ సుబ్రమణ్య శర్మ, కయ్యూరు బాలసుబ్రమణ్యం, ఎస్.రామకృష్ణ

- పది పరీక్షల సమస్యల పరిష్కారానికి

ప్రత్యేక గ్రీవెన్స్ సెల్

తిరుపతి(విద్య), నవంబరు 24(ఆంధ్రజ్యోతి): రానున్న 10వ తరగతి పబ్లిక్ పరీక్షలకు సంబంధించి సందేహాల నివృత్తి, సమస్యల పరిష్కారానికి ప్రత్యేకంగా గ్రీవెన్స్ సెల్‌ను ఏర్పాటు చేసినట్టు డీఈవో కేవీఎన్ కుమార్ వెల్లడించారు. విద్యార్థులు, వారి తల్లిదండ్రుల సందేహాలు, సమస్యలను సత్వరం పరిష్కరించేలా ఐదుగురు సబ్జెక్ట్ నిపుణులను సెల్‌లో నియమించారు. ఏసీజీఈ పి. గురుస్వామిరెడ్డి (సెల్ నం: 94403 11629),సూపరింటెండెంట్ పి.రాఘవేంద్రరావు (79892 50005), సీనియర్ అసిస్టెంట్ పి.శరీష్‌కుమార్ (96528 86699),ఏపీవో ఐ.దాము(91823 21491)ను ఆయా సెల్‌ఫోన్ నంబర్లలో సంప్రదించి విద్యార్థులు, తల్లిదండ్రులు తమ సందేహాలను నివృత్తి చేసుకోవచ్చు.

ఇద్దరిపై పీడీ యాక్టు!

తిరుపతి(నేరవిభాగం), నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఇద్దరిపై పీడీ యాక్టు నమోదుకు ప్రభుత్వం ఆమోదం తెలిపింది. వివిధ నేరాలకు సంబంధించి తిరుపతి నగరం కొర్లగుంట మారుతినగర్‌కు చెందిన సయ్యద్ అజీమ్, పులిచెర్ల మండలవాసి, ప్రస్తుతం తిరుపతి నగరంలోని ఉద్యోగనగర్‌లో నివాసం ఉంటున్న వట్టికుంట అరుణ్‌కుమార్ అలియాస్ అరుణ్‌పై పీడీ యాక్టు నమోదుకు కలెక్టర్ వెంకటేశ్వర్ ప్రభుత్వానికి లేఖ రాశారు. దీనికి ఆమోదం తెలుపుతూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది.

తిరుపతి మీదుగా మరో వందేభారత్

● విజయవాడ నుంచి బెంగళూరుకు 10న ప్రారంభం



చిత్తూరు, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): హైదరాబాదు-తిరుపతి మధ్య వందేభారత్ రైలు నడుస్తోంది. తాజాగా విజయవాడ నుంచి తిరుపతి, చిత్తూరు మీదుగా బెంగళూరు వరకు మరో వందేభారత్ నడవనుంది. డిసెంబరు పది నుంచి దీనిని నడిపేందుకు ముహూర్తం ఖరారు చేశారు. ఈ రైలు ద్వారా విజయవాడ నుంచి బెంగళూరుకు 9 గంటల్లోనే చేరుకునే అవకాశం ఉంది. మొత్తం 8 బోగీల్లో.. 7 ఏసీ చైర్‌కార్, ఒకటి ఎగ్జిక్యూటివ్ చైర్‌కార్ ఉంటాయి.డిసెంబరు 10 నుంచి మంగళవారం మినహా అన్ని రోజుల్లో ఇది ప్రయాణిస్తుంది. విజయవాడలో తెల్లవారుజామున 5.15 గంటలకు బయల్దేరి తెనాలి, ఒంగోలు, నెల్లూరు, తిరుపతి మీదుగా 10.27 గంటలకు చిత్తూరు చేరుకుంటుంది. ఇక్కడి నుంచి కాట్పాడి జంక్షన్, కేఆర్ పురం మీదుగా బెంగుళూరు (ఎస్ఎంవీటీ)కి మధ్యాహ్నం 1.15 గంటలకు చేరుతుంది. తిరిగి ఈ రైలు బెంగళూరులో మధ్యాహ్నం 2.45 గంటలకు బయల్దేరి చిత్తూరుకు సాయంత్రం 5.49 గంటలకు చేరుకుంటుంది. ఇక్కడి నుంచి రాత్రి 11.45 గంటలకు విజయవాడకు చేరుకుంటుంది. విజయవాడ, బెంగళూరు నుంచి తిరుమల వెళ్లే భక్తులకు ఈ రైలు బాగా ఉపయోగపడనుంది.

జిల్లాలో తేలికపాటి వర్షం

తిరుపతి(కలెక్టరేట్), నవంబరు 24(ఆంధ్రజ్యోతి): బంగాళఖాతంలో అల్పపీడనం కారణంగా సోమవారం జిల్లాలో తేలికపాటి వర్షం కురిసింది. బీఎన్‌కండ్రిగమండలంలో 40.2 మి.మీ., కేవీబీపురం33.8, చిల్లకూరు 22.8, తిరుపతి(అర్బన్)20.2, చంద్రగిరిలో 18.6 మి.మీల వర్షంపాతం నమోదైంది. మంగళ, బుధవారాల్లో జిల్లాలో భారీవర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ తెలిపింది.

పంచలోహ తాపడ ద్వారం ప్రారంభం



ద్వారం ప్రారంభోత్సవంలో ఎమ్మెల్యే నాని దంపతులు, టీడీపీ నాయకులు

చంద్రగిరి, నవంబరు 24(ఆంధ్రజ్యోతి): చంద్రగిరిలో వెలసిన మూలస్థాన ఎల్లమ్మ ఆలయంలో దాతల సహకారంతో గర్భగుడికి పంచలోహ తాపడంతో నిర్మించిన ద్వారాన్ని సోమవారం ఎమ్మెల్యే పులివర్తి నాని దంపతులు ప్రారంభించారు. నాని దంపతులకు ఆలయ చైర్మన్ మొక్కల చంద్రశేఖర్‌రెడ్డి, పాలక మండలి సభ్యులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. అనంతరం వారు అమ్మవారిని దర్శించుకుని, దాతల సహకారంతో రూ.10 లక్షల విలువగల గర్భగుడి పంచలోహ తాపడం ద్వారాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ మండలాధ్యక్షుడు బాలకృష్ణమూర్తి, ప్రధాన కార్యదర్శి కొండూరు ప్రవీణ్‌రాయల్, ఏఎంసీ చైర్మన్ గౌస్‌బాషా, ఈవో మమత, సింగిల్‌విండో చైర్మన్ రాజులగారి వినోద్, పాలకమండలి సభ్యులు వెంకటముని, రామారావు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

మితిమీరిన యాంటీబయోటిక్స్ ప్రాణాంతకం



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న డాక్టర్ నాగరాజనాయుడు

పాకాల, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): వ్యాధి నిర్ధారణ కాకుండా మితిమీరిన యాంటీబయోటిక్స్ వాడకం ప్రాణాంతకమని ప్రగతి గ్రామీణాభివృద్ధి ట్రస్ట్ (కృష్ణాపురం) అధ్యక్షుడు ఆర్.నాగరాజనాయుడు అన్నారు. మొగరాల జడ్పీహైస్కూల్‌లో సోమవారం యాంటీమైక్రోబియల్ రెసిస్టెంట్స్‌పై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఆయన మాట్లాడుతూ మనల్ని రక్షించే మందులను ఆదా చేయాలని కోరారు. ఇన్‌ఫెక్షన్లు రాకపోతే నిరోధకత తలెత్తదన్నారు. వైద్యుల సలహా మేరకే మందులను వాడాలన్నారు. విద్యార్థులచే గ్రామంలో ర్యాలీ నిర్వహించి ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో హెచ్‌ఎం సుమలత, ట్రస్ట్ సభ్యుడు శివముని, ఉపాధ్యాయులు వి.వెంకటసిద్దులు, ఆదికేశవులు నాయుడు, విమలా విక్టోరియా, సుల్తాన్, బాబునాయుడు, రామ్మూర్తి తదితరులు పాల్గొన్నారు.

'రైతన్నా మీ కోసం' ప్రారంభం



వెంకటరామాపురంలో కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న అధికారులు, నేతలు

పాకాల, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పెద్దరామాపురం పంచాయతీ వెంకటరామాపురంలో సోమవారం రైతన్నా మీకోసం కార్యక్రమాన్ని మండల వ్యవసాయాధికారిణి హరిత కుమారి, కూటమి నాయకులు ప్రారంభించారు. గ్రామంలో రైతుల వివరాలను నమోదు చేశారు. ప్రభుత్వం రైతులకు అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను వివరించారు. పంచసూత్రాలతో లాభసాటి వ్యవసాయ విధానాలపై రైతులకు అవగాహన కల్పించారు. ముఖ్యమంత్రి రైతులకు రాసిన లేఖను అందజేశారు. ఈ కార్యక్రమంలో వీహెచ్‌ఏ లతారెడ్డి, వెటర్నరీ అసిస్టెంట్ కర్ణయాదవ్, కూటమి నాయకులు అనంతనేని బాలాజీ, గోకుల్, మోహన్ కృష్ణ, బుజ్జి, విశ్వనాథం నాయుడు, గోపి, బొల్లి, భరత్ తదితరులు పాల్గొన్నారు.

యువత మత్తుపదార్థాలకు దూరంగా ఉండాలి



మాట్లాడుతున్న దామోదర్

తిరుపతిరూరల్, నవంబరు 24(ఆంధ్రజ్యోతి): విద్యార్థి దశలో మత్తుపదార్థాలకు బానిసలుగా మారితే భవిష్యత్ నాశనం అవుతుందని, వీటికి దూరంగా ఉంటూ లక్ష్యాల సాధనకు ప్రణాళికలు ఆచరించాలని శ్రీరామ ఇంజనీరింగ్ కళాశాల చైర్మన్ మన్నెం రామిరెడ్డి పేర్కొన్నారు. కరకంబాడీరోడ్డులోని కళాశాలలో ఎన్‌ఎస్‌ఎస్ విభాగం, ఎస్‌ఎఫ్‌ఐ సంయుక్త ఆధ్వర్యంలో సోమవారం ఇంజనీరింగ్ ప్రథమ సంవత్సర విద్యార్థులకు డ్రగ్స్ ఫ్రీ సొసైటీ - ర్యాగింగ్ ఫ్రీ అనే అంశంపై నిర్వహించిన సదస్సులో ఆయన మాట్లాడారు. డ్రగ్స్ రహిత, ర్యాగింగ్ రహిత క్యాంపస్‌గా నిలబెడుతామని విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. ముఖ్యవక్తలుగా హాజరైన తిరుపతి గోవిందధామం అధ్యక్షుడు టి.దామోదర్, జనవిజ్ఞాన వేదిక కార్యదర్శి రెడ్డెప్ప మాట్లాడుతూ.. కొందరు యువత డ్రగ్స్‌కి బానిసలై జీవితాన్ని నాశనం చేసుకుని రోడ్డునపడుతున్నారని, దీంతో కుటుంబానికి తీరని మనోవేదనని మిగిల్చుతున్నారని తెలిపారు. డైరెక్టర్స్ మన్నెం రామసుబ్బారెడ్డి, మన్నెం అరవింద్‌కుమార్‌రెడ్డి, ప్రిన్సిపాల్ డాక్టర్ కె.జయచంద్ర, ఎన్‌ఎస్‌ఎస్ కన్వీనర్ ఎస్.చక్రి శ్రీధర్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

తెలుగు మహిళా నాయకురాలి మృతి



సత్యవతి భౌతికకాయానికి నివాళులర్పిస్తున్న టీడీపీ నేతలు సుగుణమ్మ, ఆర్సీ మునికృష్ణ తదితరులు

తిరుపతి, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): టీడీపీ తిరుపతి పార్లమెంట్ కమిటీ కార్యదర్శి, నగర మహిళా మాజీ అధ్యక్షురాలు పల్లా సత్యవతి అనారోగ్యంతో మృతిచెందారు. టీడీపీ నాయకులు సోమవారం ఆమె భౌతికకాయానికి పార్టీ జెండా కప్పి నివాళులర్పించారు. ఏపీజీబీసీ చైర్మన్ సుగుణమ్మ, ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు, డిప్యూటీ మేయర్ ఆర్సీ మునికృష్ణ, నాయకులు జేబీ శ్రీనివాస్, కందాటి సురేష్, మహేష్ యాదవ్, జేడబ్ల్యు విజయకుమార్, మన్యం శ్రీనివాసులు, బ్యాంకు శాంతమ్మ, మునిశేఖర్ రాయల్ తదితరులు పాల్గొన్నారు.

డిజిటల్ బోధనోపకరణాలతో ఉత్తమ విద్య



శిక్షణా కార్యక్రమంలో మాట్లాడుతున్న గౌరీశంకర్

తిరుపతి(విద్య), నవంబరు 24(ఆంధ్రజ్యోతి): డిజిటల్ బోధనోపకరణాలను ఉపయోగించుకుని విద్యార్థులకు ఉత్తమ విద్య అందించాలని జిల్లా సమగ్ర శిక్ష అడిషనల్ ప్రాజెక్ట్ కోఆర్డినేటర్ గౌరీశంకర్ ఉపాధ్యాయులకు సూచించారు. పర్సనలైజ్డ్ అడాప్టివ్ లెర్నింగ్ (పీఏఎల్) కార్యక్రమంలో భాగంగా పీఎం శ్రీ పాఠశాలల ఉపాధ్యాయులకు ఒకరోజు ప్రత్యేక శిక్షణా కార్యక్రమం పద్మావతీపురం ఉన్నత పాఠశాలలో సోమవారం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ విద్యార్థుల వ్యక్తిగత స్థాయికి అనుగుణంగా బోధిస్తూ వారిలో నైపుణ్యాలను మెరుగుపరచాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సమగ్ర శిక్ష అకడమిక్ మానిటరింగ్ అధికారి చంద్రశేఖర్ నాయుడు, సీఎంవో సురేష్, ఏపీవో డాక్టర్ సుధాకర్‌నాయుడు, సెక్టోరియల్ అధికారులు పాల్గొన్నారు.

శివాలయాల్లో వైభవంగా కార్తీక మాస పూజలు



అగస్త్యేశ్వరస్వామి ఆలయంలో ఘటాభిషేకంలో స్వామివారు, విశేషాలంకరణలో ఆనందవల్లీదేవి

చంద్రగిరి, నవంబరు 24(ఆంధ్రజ్యోతి): మండలంలోని శివాలయాల్లో సోమవారం కార్తీకమాస పూజలు వైభవంగా నిర్వహించారు. తొండవాడ వద్ద స్వర్ణముఖి నది ఒడ్డున వెలసిన అగస్త్యేశ్వరస్వామి (ముక్కోటి)ఆలయంలో అగస్త్యేశ్వర స్వామికి రుద్రాభిషేకం, అనందవల్లీ దేవికి అభిషేకం, స్వామివారికి ఘటాభిషేకం నిర్వహించి భక్తులకు దర్శనం కల్పించారు. మహిళలు భక్తిశ్రద్ధలతో దీపారాధన నిర్వహించారు. ముక్కోటి ఆలయ ధర్మకర్త మొగిలి రఘునాథరెడ్డి, భక్తులు పాల్గొన్నారు. చంద్రగిరిలోని శ్యామలాంబ సమేత మల్లేశ్వరాలయంలో స్వామివారికి రుద్రాభిషేకం చేసి, సింధూరం అలంకరణ చేసి భక్తులకు దర్శనం కల్పించారు. ఆలయ శైవాంగ పండితులు శివకుమార్ శర్మ, కమిటీ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

ఎన్‌ఎస్‌ఎస్ విద్యార్థుల శ్రమదానం



ఇరంగారిపల్లెలో మొక్కలు నాటుతున్న ప్రిన్సిపాల్ రమేష్‌కుమార్

పాకాల, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఎన్‌ఎస్‌ఎస్ విద్యార్థుల సోమవారం ఇరంగారిపల్లెలో శ్రమదానం చేశారు. పాఠశాల, సచివాలయం పరిసరాలలో పిచ్చి మొక్కలను తొలగించి శుభ్రం చేసి, పూలమొక్కలు, పండ్లమొక్కలు నాటారు. ప్రిన్సిపాల్ రమేష్‌కుమార్ మాట్లాడుతూ ప్రత్యేక క్యాంపులో భాగంగా ఎన్‌ఎస్‌ఎస్ విద్యార్థులు సేవా కార్యక్రమాలు చేపట్టారన్నారు. మెరుగైన పారిశుధ్య నిర్వహణపై గ్రామస్తులకు అవగాహన కల్పిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఎన్‌ఎస్‌ఎస్ పీవో డాక్టర్ మాశిలామణి, అధ్యాపకులు ఈశ్వరబాబు, రమణమ్మ, డిల్లీ ప్రసాద్, హెడ్‌మాస్టర్ మునిరాజారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఎన్‌సీసీ క్యాడెట్‌కు అభినందన



గోపీచంద్‌ను అభినందిస్తున్న శేషారెడ్డి

తిరుపతి రూరల్, నవంబరు 24(ఆంధ్రజ్యోతి): తాటితోపులోని బీఎస్ఆర్ డిగ్రీ కళాశాలలో తృతీయ సంవత్సరం చదివే ఎన్‌సీసీ విద్యార్థి ఎ.గోపీచంద్ రాజస్థాన్‌లోని జైసల్మేర్‌లో నిర్వహించిన యూత్ ఎక్సేంజ్ ప్రోగ్రామ్‌లో ప్రతిభచాటారని కళాశాల చైర్మన్ బి.శేషారెడ్డి పేర్కొన్నారు. నేపాల్, కజకిస్తాన్ దేశాలకు చెందిన పలువురు ఎన్‌సీసీ క్యాడెట్లు హాజరవ్వగా..గోపీచంద్ (ఎస్‌యూవో) పలు పతకాలు సాధించారని తెలిపారు. విద్యార్థిని తిరుపతి 29యూనిట్ ఎన్‌సీసీ కమాండర్ కల్నల్ విక్రమ్ ప్రసన్నతో శేషారెడ్డి కలసి అభినందించారు.

రైల్వే అండర్‌బ్రిడ్జి సమీపంలో గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం

పాకాల, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): పాకాల - తిరుపతి రైల్వే మార్గంలో ముద్దలపల్లె రైల్వే అండర్ బ్రిడ్జి సమీపంలో ట్రాక్ పక్కన ఓ గుర్తుతెలియని వ్యక్తి మృతదేహాన్ని సోమవారం ఉదయం గుర్తించారు. ఈ వ్యక్తి సుమారు 25-30 సంవత్సరాల వయస్సు కలిగి ఉంటాడు. సమాచారం అందుకున్న రైల్వే ఎస్‌ఐ ధర్మేంద్ర సంఘటనా స్థలానికి వెళ్లి, పరిశీలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

కారు ఢీకొని దుప్పి మృతి



దుప్పిని ఢీకొన్న దెబ్బతిన్న కారు ముందు భాగం

చంద్రగిరి, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): చంద్రగిరి మండలం, ఎ.రంగంపేట సమీపంలో కళ్యాణీ డ్యామ్ వద్ద తిరుపతి - పీలేరు జాతీయ రహదారిలో దుప్పిని కారు ఢీకొన్న ప్రమాదంలో తీవ్ర గాయాలతో దుప్పి మృతి చెందగా, కారు ముందు భాగం దెబ్బతింది. స్థానికుల కథనం మేరకు భాకరాపేట నుంచి తిరుపతి వైపు కారు వస్తుండగా శేషాచలం అటవీ ప్రాంతం నుంచి దుప్పి రోడ్డుపైకి అకస్మాత్తుగా వచ్చింది. దీంతో కారు వేగంగా ఢీకొనడంతో దుప్పి అక్కడికక్కడే మృతి చెందింది. కారు ముందు భాగం దెబ్బతింది.

తగిలేలా విద్యుత్ తీగలు



విష్ణునివాసం తూర్పు వీధిలో వేలాడుతున్న విద్యుత్ కేబుల్

తిరుపతి అర్బన్, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): స్థానిక విష్ణునివాసం తూర్పు వీధిలో విద్యుత్ తీగలు మనుషులకు తగిలేలా ఉన్నాయి. ఇటీవల మరమ్మతుల కోసం ఊడ తీసిన జాయింట్ కేబుల్స్‌ను నిర్లక్ష్యంగా వదిలేశారు. రక్షణ ఏర్పాట్లు చేపట్టకపోవడంతో అవి వేలాడుతూ ప్రమాదకరంగా ఉంటున్నాయి. రాత్రివేళలో పొరపాటున తగిలినా, ఏమరుపాటుతో ముట్టుకున్నా ప్రాణాపాయం పొంచి ఉంది. ఈ విషయం తెలిసినా విద్యుత్ శాఖ అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుండటం గమనార్హం. ప్రమాదం జరగకముందే స్పందించి చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

రైతన్న కుటుంబాల్లో వెలుగు నింపడమే లక్ష్యం

● 'రైతన్నా మీకోసం'లో ఎమ్మెల్యే నాని



అన్నదాత సుఖీభవ గురించి రైతుకు వివరిస్తున్న ఎమ్మెల్యే నాని

తిరుపతిరూరల్, నవంబరు 24(ఆంధ్రజ్యోతి): రైతన్న కుటుంబాల్లో వెలుగునింపడమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే పులివర్తి నాని అన్నారు. తిరుపతి రూరల్ మండలం మల్లంగుంటలో సోమవారం రైతన్నా మీకోసం కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. ఎమ్మెల్యే స్వయంగా లబ్ధిదారుల ఇంటివద్దకు వెళ్లి అన్నదాత సుఖీభవ పథకాన్ని వివరించడంతోపాటు సమస్యలను అడిగి తెలుసుకున్నారు. గ్రామంలో రూ.1.50కోట్లతో రోడ్ల నిర్మాణాలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. 48మంది రైతు కుటుంబాలను కలిశారు. వీరిలో ఒకరైతుకి రూ.2వేలు జమకాలేదని ఎమ్మెల్యే దృష్టికి తీసుకురాగా వెంటనే సమస్యను పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. అన్నదాతసుఖీభవ పథకం అందని రైతులు నిబంధనలు పాటిస్తూ ఆధార్‌లింక్ ఉన్న బ్యాంకుఖాతాకి పట్టాదారు పాసుపుస్తకాన్ని అనుసంధానం చేసుకోవాలని సూచించారు. రైతులు ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. టీడీపీ రూరల్ మండల అధ్యక్షుడు ఈశ్వర్‌రెడ్డి, గ్రామ టీడీపీ నేతలు మునికృష్ణారెడ్డి, దిలీప్‌కుమార్‌యాదవ్, మునస్వామియాదవ్, మార్కెట్‌కమిటీ చైర్మన్ మౌనిక, డైరెక్టర్ లతమ్మ, నాయకులు మధు, మధుశేఖర్, సుధాయాదవ్, అధికారులు, పంచాయతీ కార్యదర్శి ఎం.లక్ష్మీదేవి తదితరులు పాల్గొన్నారు. ● భాకరాపేట(ఆంధ్రజ్యోతి): చిన్నగొట్టిగల్లు మండలం టి.కమ్మరపల్లెలో టీడీపీ క్లస్టర్ ఇన్‌చార్జ్ శివకుమార్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో ఇంటింటా సీఎం సందేశాలను అందజేశారు. సింగిల్ విండో అధ్యక్షులు ముత్తం ప్రభాకర్, టీడీపీ నాయకులు మోహన్ రెడ్డి, ఆర్సీ రమణారెడ్డి, చోటా సాహెబ్, హైదర్, రాజేంద్ర, మల్లికార్జున, జేబీ బాలాజీ, అగ్రికల్చర్ అసిస్టెంట్ కుమార్ నాయక్ తదితరులు పాల్గొన్నారు. ● రామచంద్రాపురం(ఆంధ్రజ్యోతి): అన్నదాత సుఖీభవ రెండవ విడత నగదు విడుదలపై మండలంలోని పలు గ్రామాల్లో సింగిల్‌విండో చైర్మన్ జనార్థన చౌదరి ఆధ్వర్యంలో స్థానిక టీడీపీ నాయకులు, వ్యవసాయశాఖ సిబ్బంది ఇంటింటి ప్రచారం నిర్వహించారు. అన్నదాత సుఖీభవ వర్తించని రైతుల నుంచి దరఖాస్తులు స్వీకరించారు. మాజీ ఎంపీపీ బిందుమాధవి, నాయకులు వెంకటప్రసాద్, కోరా హరిప్రసాద్, మహేష్‌నాయుడు, దినేష్‌నాయుడు, కోటేశ్వరరెడ్డి, సుగుణమ్మ, రాజేష్, భూపతిరెడ్డి, జగదీష్, వ్యవసాయశాఖాధికారిణి మమత, నాయకులు, రైతులు, వ్యవసాయశాఖ సిబ్బంది పాల్గొన్నారు.

అధ్వానంగా రహదారులు

● అవస్థలు పడుతున్న తనపల్లె ప్రజలు



తనపల్లెలో రహదారులపై ఏర్పడిన గుంతల్లో నిలిచిన నీరు

తిరుపతిరూరల్, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): తనపల్లెలోని పలురోడ్లు గుంతలమయంగా తయారయ్యాయి. గ్రామానికి వెళ్లే ముఖద్వారం నుంచి సచివాలయానికి చేరుకునే రహదారిపై పలుచోట్ల గోతులు ఏర్పడ్డాయి. సిమెంటు రోడ్డు మిట్టపల్లాలుగా తయారైంది. వాహనాన్ని నడిపేటప్పుడు ఏమాత్రం పట్టుతప్పినా అదుపుతప్పి ప్రమాదాలకు గురయ్యే పరిస్థితి ఉందని స్థానికులు ఆందోళన చెందుతున్నారు. కుంట్రపాకానికి వెళ్లే ప్రధానరహదారితోపాటు గ్రామంలో ఇళ్ల ముందు ఏర్పడిన గోతుల వల్ల వాహనదారులు, పాదచారులు, స్థానికులు అవస్థలు పడుతున్నారు. చిన్నపాటి వర్షానికి గుంతల్లో వర్షపునీరు నిల్వచేరి మరింత ఇబ్బందికరంగా తయారవుతోంది. మురుగు కాలువలు లేకపోవడంతో నీరు ముందుకు కదలక నిలచిపోతోందని, దీంతో దోమలు వృద్ధి చెంది అనారోగ్యాలబారిన పడుతున్నామని స్థానికులు వాపోతున్నారు. అధికారులు స్పందించి తగిన చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

ముగిసిన అంతర జిల్లా హాకీ క్రీడా పోటీలు

● విజేతలుగా కడప జిల్లా బాల, బాలికల జట్లు



హాకీ పోటీల్లో విజేతలుగా నిలిచిన కడప జిల్లా బాల, బాలికల జట్లు

చంద్రగిరి, నవంబరు 24(ఆంధ్రజ్యోతి): చంద్రగిరిలో గత మూడు రోజులుగా స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఏపీ ఆధ్వర్యంలో జరుగుతున్న 69వ రాష్ట్రస్థాయి హాకీ అండర్-14 పోటీలు సోమవారంతో ముగిశాయి. ఈ పోటీల్లో విన్నర్స్‌గా కడప జిల్లా బాల, బాలికల జట్లు నిలిచాయి. బాలుర విభాగంలో ద్వితీయ స్థానంలో విశాఖ జట్టు, బాలికల విభాగంలో అనంతపురం జట్టు నిలిచింది. బాలుర ఫైనల్స్‌లో వైయస్సార్ కడప జట్టు, విశాఖ జట్టుపై 5-1 గోల్స్‌తో గెలిచి విన్నర్‌గా నిలిచి చాంపియన్‌షిప్ ట్రోఫీని అందుకుంది. విశాఖ జిల్లా జట్టు రన్నర్స్‌గా ద్వితీయ స్థానం ట్రోఫీ అందుకుంది. బాలికల ఫైనల్ మ్యాచ్‌లో వైయస్సార్ కడప జట్టు, అనంతపురం జట్టుపై 4-1 గోల్స్‌తో గెలిచి చాంపియన్‌షిప్ ట్రోఫీని అందుకుంది. అనంతపురం జట్టు ద్వితీయ స్థానంతో రన్నర్స్‌గా నిలిచింది. అంతకు ముందు జరిగిన బాలుర మొదటి సెమీఫైనల్స్‌లో విశాఖ జట్టు 4-0 గోల్స్‌తో తూర్పుగోదావరి జట్టుపై విజయం సాధించి ఫైనల్స్ చేరుకుంది. మరొక సెమీఫైనల్స్‌లో బాలుర విభాగంలో వైయస్సార్ కడప జట్టు 5-0 గోల్స్‌తో అనంతపురం జట్టుపై గెలిచి ఫైనల్స్‌కు చేరింది. బాలికల మొదటి సెమీఫైనల్‌లో వైఎస్సార్ కడప జట్టు 7-0 గోల్స్‌తో విశాఖపట్నంపై గెలిచి ఫైనల్‌కు ప్రవేశించింది. బాలికల రెండవ సెమీఫైనల్స్‌లో అనంతపురం జట్టు 4-0 గోల్స్‌తో ఈస్ట్ గోదావరిని ఓడించి ఫైనల్స్‌కు అర్హత సాధించింది. తరువాత నిర్వహించిన తృతీయ స్థానం పోటీల్లో బాలికల విభాగంలో విశాఖ జట్టు 2-1 గోల్స్‌తో ఈస్ట్ గోదావరి జట్టును ఓడించి, తృతీయ స్థానాన్ని నిలబెట్టుకుంది ఈస్ట్ గోదావరి జట్టు నాలుగో స్థానంతో సరిపెట్టుకోవలసి వచ్చింది. బాలుర తృతీయ స్థానానికి జరిగిన పోటీల్లో ఈస్ట్ గోదావరి జట్టు అనంతపురం జట్టుపై 3-0 గోల్స్ తేడాతో గెలిచి మూడో స్థానాన్ని పొందగా, నాలుగో స్థానంలో ఈస్ట్ గోదావరి జట్టు నిలిచింది. విజేతలుగా నిలిచిన జట్లకు బహుమతులు ప్రదానం చేశారు. అనంతరం రాష్ట్ర స్థాయి జట్టుకు బాల బాలికల క్రీడాకారులను ఎంపిక చేశారు. క్రీడల ముగింపులో స్కూల్ గేమ్స్ కార్యదర్శులు కిషోర్ భార్గవి, దేవి, అబ్జర్వర్ థామస్, ఆర్కే.సెలవపాండెంనే, స్కూల్ గేమ్స్ మాజీ కార్యదర్శి కేశవయ్య, హరికృష్ణ, కిరణ్ కుమార్, ప్రభాకర్, జేమ్స్, చంద్రశేఖర్, శ్రీనివాసులుఆచారి, కిరణ్ కుమార్, వ్యాయామ ఉపాధ్యాయుని, ఉపాధ్యాయులు కోచ్‌లు, మేనేజర్లు క్రీడాకారులు పాల్గొన్నారు.

ప్రమాదకర మలుపు

● వాహన చోదకులకు ఇక్కట్లు



పచ్చికాపల్లం రహదారిలో ముత్యాలమ్మ ఆలయం వద్ద ప్రమాదకర మలుపు

రామచంద్రాపురం, నవంబరు 24(ఆంధ్రజ్యోతి): తిరుపతి - పచ్చికాపల్లం ప్రధానరహదారి రాయలచెరువుపేట ముత్యాలమ్మ ఆలయం వద్ద ప్రమాదకర మలుపుతో వాహనచోదకులు ఇక్కట్లు ఎదుర్కొంటున్నారు. ఇక్కడ అవతలినుంచి వచ్చే వాహనాలు పూర్తిగా కనిపించే పరిస్థితి లేకపోవడంతో తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. వర్షాకాలం అడవి నుంచి వచ్చే నీరు గుంతలో నిల్వ ఉండటంతో లోతు తెలియక వాహనచోదకులు అదుపు తప్పే పరిస్థితి ఉంది. ద్విచక్రవాహన చోదకులు ప్రయాణించే సమయంలో భారీ వాహనాలు వస్తే తప్పించుకోలేక తడిసి ముద్దవుతున్నారు. దీంతో తిరిగి ఇంటిముఖం పట్టాల్సి ఉంది. ప్రమాదకర మలుపు వద్ద ముళ్ల పొదలను తొలగించి నీటిగుంతలను పూడ్చి, సూచిక బోర్డు ఏర్పాటు చేయాలని ప్రజలు కోరుతున్నారు.

రైల్వే అండర్ బ్రిడ్జి కింద రాకపోకలకు అనుమతులు ఇచ్చేదెప్పుడో...?

తిరుపతి (సెంట్రల్), నవంబరు 24(ఆంధ్రజ్యోతి): తిరుపతి - రేణిగుంట రైలు మార్గంలో పద్మావతి ఫ్లోర్‌మిల్లు వద్ద ఉన్న రైల్వే గేటుకు ప్రత్యామ్నాయంగా నిర్మించిన అండర్ బ్రిడ్జిని ఎట్టకేలకు భద్రతా ప్రమాణాలతో పూర్తి చేశారు. ఏడాది క్రితం ప్రారంభించిన ఈ నిర్మాణ పనులను దశల వారీగా పూర్తి చేశారు. సేఫ్టీ అధికారులు పరిశీలించి సర్టిఫికెట్ ఇవ్వాల్సి ఉంది. వారు ఎప్పుడు వచ్చి సర్టిఫికెట్ ఇస్తారో తెలియదు కానీ ప్రజలకు, సీఆర్‌ఎస్‌లో విధులు నిర్వహిస్తున్న 1,200 మందికి పైగా ఉద్యోగులకు తిప్పలు తప్పడం లేదు. రెండేళ్లుగా విధులకు మూడు కిలోమీటర్ల దూరం తిరిగి వెళ్లాల్సి వస్తోందని ఉద్యోగులు వాపోతున్నారు. శెట్టిపల్లి గ్రామ ప్రజల తిప్పలు వర్ణనాతీతంగా ఉన్నాయి. అండర్ బ్రిడ్జి నిర్మాణ పనులు పూర్తి అయిన సమాచారం జోనల్ అధికారులకు తెలిసినా ఎందుకు స్పందించడం లేదన్న విమర్శలున్నాయి. ఇప్పటికైనా ఉన్నతస్థాయి రైల్వే అధికారులు స్పందించి సేఫ్టీ సర్టిఫికెట్‌ను మంజూరు చేసి అండర్ బ్రిడ్జిని ప్రజల రాకపోకలకు అందుబాటులోకి తీసుకురావాల్సిన అవసరం ఉంది.

కోనపరెడ్డిపల్లెలో ఆగని బస్సులు



కోనపరెడ్డిపల్లెలో వున్న బస్ స్టాప్

పాకాల, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): పూతలపట్టు - నాయుడుపేట జాతీయ రహదారిలో పాకాల మండలం కోనపరెడ్డిపల్లె వద్ద అధికారికంగా బస్‌స్టాప్ ఉంది. చిత్తూరు - తిరుపతి, కాణిపాకం - తిరుపతి బస్సులు ఈ రహదారిలో వెళ్తున్నా కోనపరెడ్డిపల్లెలో మాత్రం నిలపడం లేదు. గంటల కొద్దీ బస్‌స్టాప్‌లో వేచివున్నా ఖాళీగా వెళ్తున్న బస్సులు సైతం ఆపరు. దీంతో సామిరెడ్డిపల్లె, తోటపల్లె, బైనపల్లె, కందేరి ఇండ్లు, గోళ్లవారిపల్లె, బేరిపల్లె, చిటిపిరాళ్ల గ్రామాల ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. సంబంధిత శాఖ అధికారులు స్పందించి కోనపరెడ్డిపల్లె వద్ద బస్సులు ఆపాలని పరిసర గ్రామాల ప్రజలు విజ్ఞప్తి చేస్తున్నారు.

అకాడమీ ఉన్నతికి తోడ్పడండి

● వర్సిటీ వీసీలతో తెలుగు, సంస్కృత అకాడమీ చైర్మన్



చైర్మన్ విల్సన్‌కు వినతిపత్రం ఇస్తున్న రెక్టార్ అప్పారావు, రిజిస్ట్రార్ భూపతి నాయుడు

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): తిరుపతిలోని యూనివర్సిటీల వీసీలతో తెలుగు, సంస్కృత అకాడమీ చైర్మన్ ఆర్డీ విల్సన్ మర్యాద పూర్వకంగా కలిశారు. తెలుగు, సంస్కృత అకాడమీ ఉన్నతికి తోడ్పడాలని ఆయన కోరగా, వారు సానుకూలంగా స్పందించారు. 'అకాడమీకి పద్మావతి వర్సిటీకి చెందిన ముద్రణా బాధ్యతలు ఇస్తామని వీసీ ఉమ హామీ ఇచ్చారని విల్సన్ చెప్పారు. జాతీయ సంస్కృత యూనివర్సిటీని సందర్శించారు. తెలుగు, సంస్కృత భాషలకు సంబంధించి బోధన, పరిశోధన, విస్తరణ కార్యక్రమాల గురించి అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా సంస్కృత వర్సిటీ రిజిస్ట్రార్ వెంకటనారాయణ శాలువాతో సత్కరించారు. తెలుగు, సంస్కృత అకాడమీ తో ముడిపడిన అంశాలపై ఎస్వీయూ రెక్టార్ అప్పారావు, రిజిస్ట్రార్ భూపతి నాయుడు వినతిపత్రం సమర్పించారు. ఈ అంశాలను పరిష్కరించేలా చూస్తానని వారికి చైర్మన్ హామీ ఇచ్చారు.

చిన్నారిని తల్లిదండ్రుల వద్దకు చేర్చిన పోలీసులు



తిరుచానూరు, నవంబరు 24(ఆంధ్రజ్యోతి): శ్రీపద్మావతి అమ్మవారి దర్శనం కోసం తమిళనాడు రాష్ట్ర తిరువళ్లూరు జిల్లా గుమ్మడిపూండికి చెందిన సురేందర్, సుమన్ దంపతులు సోమవారం విచ్చేశారు. భక్తుల రద్దీలో వారి రెండేళ్ల కుమార్తె దాన్వి కనిపించకుండాపోయింది. బాధితులు పోలీసులకు ఫిర్యాదుచేయడంతో కమాండ్ కంట్రోల్ సెంటర్‌లో సీసీ కెమెరాలను పరిశీలించారు. పుష్కరిణి పరిసరాల్లో దాన్వి ఉన్నట్లు గుర్తించారు. పోలీసులు తక్షణం అక్కడికి చేరుకుని చిన్నారిని వారి తల్లిదండ్రులకు అప్పగించారు.

కార్పొరేషన్ పీజీఆర్ఎస్‌కు 31 వినతులు



వినతులు స్వీకరిస్తున్న కమిషనర్ మౌర్య

తిరుపతి, నవంబరు24 (ఆంధ్రజ్యోతి) : నగర పాలక సంస్థ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికకు 31 వినతులు వచ్చాయి. నగరంలోని వివిధ ప్రాంతాలకు చెందిన ప్రజలు తమ సమస్యలపై కమిషనర్ ఎన్.మౌర్యకు వినతులు సమర్పించారు. వాటిని సంబంధిత అధికారులకు పంపి త్వరగా పరిష్కరించాలని కమిషనర్ ఆదేశించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ మేయర్లు ఆర్సీ మునికృష్ణ, ముద్ర నారాయణ, డిప్యూటీ కమిషనర్ అమరయ్య, ఎస్ఈ శ్యాంసుందర్, ఎంఈలు తులసి కుమార్, గోమతి, హెల్త్ ఆఫీసర్ యువఅన్వేష్, రెవెన్యూ అధికారులు సేతుమాధవ్, రవి పాల్గొన్నారు.

వరల్డ్ కేటిల్ బెల్ చాంపియన్‌షిప్‌లో సత్తా



ముస్సీర్‌అహ్మద్‌షేక్‌ను సన్మానిస్తున్న ఎమ్మెల్యే ఆరణి

తిరుపతి(క్రీడలు), నవంబరు 24(ఆంధ్రజ్యోతి): ఇటీవల చైనాలో జరిగిన వరల్డ్ కేటిల్ బెల్ చాంపియన్‌షిప్ అథ్లెటిక్స్‌లో తిరుపతికి చెందిన ముస్సీర్‌అహ్మద్‌షేక్ సత్తా చాటాడు. వెండిపతకాన్ని కైవసం చేసుకున్నాడు. సోమవారం ఆయన ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులును మర్యాదపూర్వకంగా కలవగా అభినందించారు. క్రీడా రంగంలో అహ్మద్‌షేక్ ప్రతిభను యువత ఆదర్శంగా తీసుకోవాలని కోరారు. జనసేన నగరాధ్యక్షుడు రాజారెడ్డి, గంగమ్మ ఆలయ చైర్మన్ మహేష్‌యాదవ్, కె.ఎం.కె.లోకేశ్ పాల్గొన్నారు.

ఎట్టకేలకు చెత్త నిల్వల తొలగింపు

తిరుపతి అర్బన్, నవంబరు 24(ఆంధ్రజ్యోతి): నగర పరిధిలోని తిమ్మినాయుడుపాళెం యాదవ విలేజ్ వీధుల్లో చెత్త నిల్వలను ఎట్టకేలకు తొలగించారు. పనిలో పనిగా చుట్టుపక్కల వీధులను శుభ్రం చేశారు. సోమవారం ఆంధ్రజ్యోతిలో 'కుప్పలు తెప్పలుగా చెత్తనిల్వలు' అంటూ కథనం ప్రచురితమైంది. స్పందించిన నగరపాలక సంస్థ పారిశుధ్య విభాగం యంత్రాలు, ట్రక్కుల సాయంతో పేరుకుపోయిన వ్యర్థాలను పూర్తిగా తరలించారు. గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు.

తెలుగు భాష పరిరక్షణకు కృషి చేయండి



విల్సన్‌ను సన్మానిస్తున్న పీఆర్ఎస్ఐ తిరుపతి చాప్టర్ ప్రతినిధులు

తిరుపతి అర్బన్, నవంబరు 24(ఆంధ్రజ్యోతి): పబ్లిక్ రిలేషన్స్ సొసైటీ ఆఫ్ ఇండియా(పీఆర్ఎస్ఐ) ఆధ్వర్యంలో సమాజాన్ని చైతన్యపరిచేలా, అంతరించిపోతున్న తెలుగు భాషను పరిరక్షించేలా కార్యక్రమాలు నిర్వహించాలని ఏపీ తెలుగు, సంస్కృత అకాడమీ చైర్మన్ ఆర్డీ విల్సన్ (శరత్‌చంద్ర) కోరారు. పీఆర్ఎస్ఐ తిరుపతి చాప్టర్ కార్యవర్గం సోమవారం పద్మావతి వర్సిటీలోని సావేరి విశ్రాంతి గృహంలో ఆయన్ను కలిసి సన్మానించింది. చాప్టర్ చైర్మన్ జి.ప్రసాద్ మాట్లాడుతూ తెలుగు భాష పరిరక్షణకు అకాడమీ తరపున కార్యక్రమాలు నిర్వహించేందుకు సంస్థ సిద్ధంగా ఉందన్నారు. పీఆర్ఎస్ఐ తిరుపతి చాప్టర్ వైస్ చైర్మన్ ఆచార్య ఎన్.రజని, కార్యదర్శి దుద్యాల చంద్రమోహన్, కోశాధికారి కె.మధుసూదన్, ఆర్సీ కృష్ణస్వామిరాజు, త్రిపురసుందరి, రవీంద్ర పాల్గొన్నారు.

రేపు దివ్యాంగుల క్రీడా పోటీలు

తిరుపతి(క్రీడలు), నవంబరు 24(ఆంధ్రజ్యోతి): డిసెంబర్ 3న అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవం సందర్భంగా బుధవారం జిల్లాస్థాయి దివ్యాంగ క్రీడా పోటీలు నిర్వహించనున్నట్లు డీఎస్‌డీవో శశిధర్ ఒక ప్రకటనలో తెలిపారు. శ్రీనివాస క్రీడా సముదాయం, ఎస్వీ తారకరామ మైదానం వేదికలలో బ్యాడ్మింటన్, చెస్, అథ్లెటిక్స్, లాంగ్‌జంప్, ఫుట్‌బాల్, వాలీబాల్ పోటీలు జరుగుతాయని పేర్కొన్నారు. ఆసక్తిగలవారు మరిన్ని వివరాలకు 9966882029, 9059606346లను సంప్రదించాలని కోరారు.

శబరిమల యాత్ర పవిత్రతను కాపాడండి



జల్లి మధుసూదన్

తిరుపతి(ఉపాధ్యాయనగర్), నవంబరు 24(ఆంధ్రజ్యోతి): శబరిమల పవిత్రతను, యాత్ర ప్రాశస్త్యాన్ని కాపాడాలని బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి జల్లి మధుసూదన్ కోరారు. సోమవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ భక్తుల సురక్షిత యాత్రకోసం కేరళ ప్రభుత్వం చర్యలు చేపట్టడం లేదన్నారు. రద్దీ నియంత్రణ, వైద్యం, శానిటేషన్, తాగునీరు వంటి మౌలిక వసతుల కల్పనలో నిర్లక్ష్యం చూపుతోందని విమర్శించారు. అక్కడి పోలీసులు భక్తులపట్ల వికృతంగా ప్రవర్తిస్తున్నారని ఆరోపించారు. దీనిపై కేరళ ప్రభుత్వం దృష్టి సారించాలని కోరారు.

ప్రసూతి ఆస్పత్రిలో మెరుగైన వైద్యం అందించాలి

తిరుపతి(ఆటోనగర్), నవంబరు24(ఆంధ్రజ్యోతి): తిరుపతి ప్రసూతి ఆసుపత్రిలో మెరుగైన వైద్యం అందించాలని ఏపీ మహిళా సమాఖ్య జిల్లా కార్యదర్శి బి.నదియా కోరారు. స్థానిక బైరాగిపట్టెడ సీపీఐ కార్యాలయంలో సోమవారం ఏపీ మహిళా సమాఖ్య ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆమె మాట్లాడుతూ సీమ జిల్లాలతో పాటు తమిళనాడు నుంచి కూడా ఆసుపత్రికి మహిళలు వస్తున్నారని చెప్పారు. కొన్ని సందర్భాల్లో ఒక బెడ్‌పై ఇద్దరు పేషెంట్లు ఉంటున్నారని చెప్పారు. బెడ్‌ల సామర్థ్యం పెంచాలని కోరారు.

భోగరాజు పట్టాభి సీతారామయ్యకు నివాళి



తిరుపతి (విశ్వవిద్యాలయాలు), నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): స్వాతంత్ర్య సమరయోధుడు, ఆంధ్రాబ్యాంకు వ్యవస్థాపకుడు భోగరాజు పట్టాభి సీతారామయ్య జయంతి సందర్భంగా పలువురు నివాళి అర్పించారు. కోదండరామాలయ దక్షిణ మాడ వీధిలోని చిగోరా ఆధ్యాత్మిక సేవా కేంద్రంలో సీతారామయ్య జయంతి వేడుకలు నిర్వహించారు. ఆయన సమాజానికి చేసిన సేవలను స్మరించుకున్నారు.

సైబర్ మోసాలపై అవగాహన

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): ఎస్వీయూ ఉమెన్ స్టడీస్ విభాగంలో సైబర్ మోసాల పట్ల అవగాహనా కార్యక్రమం నిర్వహించారు. ప్రిన్సిపాల్ భాస్కరరెడ్డి మాట్లాడుతూ డిజిటల్ లావాదేవీల పట్ల జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఉమెన్ స్టడీస్ డైరెక్టర్ సాయిసుజాత మాట్లాడుతూ ప్రస్తుత సాంకేతిక యుగంలో కొత్త తరహా మోసాల పట్ల మహిళలు అప్రమత్తంగా ఉండాలన్నారు. పద్మావతి వర్సిటీ లా అధ్యాపకురాలు మాధురి, అకడమిక్ కన్సల్టెంట్లు రమణ, జగదీశ్వరి, రాజరాజేశ్వరి, సునీత తదితరులు పాల్గొన్నారు.

మొదలియార్ కార్పొరేషన్ నేతలకు సన్మానం



తిరుపతి, డిసెంబరు24 (ఆంధ్రజ్యోతి) : మొదలియార్ కులస్తులకు అండగా ఉంటామని డెవలప్మెంట్ కార్పొరేషన్ చైర్మన్ సీఎస్ త్యాగరాజ మొదలియార్, డైరెక్టర్లు ఎస్వీఎం శ్రీధర్, పెరుమాళ్ మధు తెలిపారు. కార్పొరేషన్‌కు ఎంపికైన నేతలను ఆ కుల సేవాసంఘం ఆధ్వర్యంలో ఘనంగా సత్కరించారు. సంఘం గౌరవాధ్యక్షుడు పీడీ కృష్ణస్వామి స్వామి, ప్రధాన కార్యదర్శి వెంకటేష్ పాల్గొన్నారు.

డాక్టరేట్ ప్రదానం

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): పద్మావతి వర్సిటీ ఫార్మసీ పరిశోధకురాలు ఎం.చందన డాక్టరేట్ పొందారు. అసెస్‌మెంట్ ఆఫ్ ఆటో ఇమ్యూన్ రిస్క్, అసోసియేటెడ్ విత్ పాలిసిస్టిక్ ఓవర్ సిండ్రోమ్ థెరపీ అంశంపై ప్రొఫెసర్ అనురాధ పర్యవేక్షణలో పరిశోధన పూర్తి చేశారు.

విద్యార్థులకు అభినందన

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): సత్యసాయి శత జయంతి సందర్భంగా చేపట్టిన రాష్ట్రస్థాయి వ్యాస రచన పోటీల్లో ఎస్వీ ఆర్ట్స్ కాలేజీ విద్యార్థి హసన్‌వల్లీ (తెలుగు), తులసి (ఇంగ్లిషు) పోటీల్లో ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచారు. పద్మావతి డిగ్రీ కాలేజీ బీకాం విద్యార్థిని లహరి రాష్ట్ర స్థాయి వ్యాస రచన పోటీల్లో మొదటి స్థానంలో నిలిచారు. వీరిని ప్రిన్సిపాళ్లు వేణుగోపాలరెడ్డి, నారాయణమ్మ, తెలుగు అధ్యాపకులు కృష్ణవేణి, భీమన్న అభినందించారు.

నైపుణ్యాలపై శిక్షణ

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): పద్మావతి వర్సిటీ సోషల్ వర్క్ - క్లినికల్ సైకాలజీ విభాగం సంయుక్తంగా నైపుణ్య శిక్షణా కార్యక్రమం చేపట్టారు. ఇందులో నిపుణులు కౌన్సిలింగ్ ప్రక్రియలో అవసరమైన ప్రాథమిక నైపుణ్యాలపై శిక్షణ అందించారు. వినడం, పరిశీలన, సానుభూతి వంటి అంశాలతో పాటు ఎదుటి వారి ఆలోచనలను అంచనా వేయడంపై అవగాహన కల్పించారు. పలువురు అధికారులు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

అండర్ బ్రిడ్జి ఏర్పాటు చేయండి

తిరుపతి(జీవకోన), నవంబరు 24(ఆంధ్రజ్యోతి): చిత్తూరు-నాయుడుపేట జాతీయ రహదారి తూకివాకం సమీపంలో టయోటా షోరూం వద్ద తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయని, అక్కడ వెహికల్ అండర్ బ్రిడ్జి ఏర్పాటు చేయాలని స్థానిక వైసీపీ నేతలు ఎంపీ గురుమూర్తిని కోరారు. ఈ మేరకు సోమవారం ఆయన్ను కలిసి వినతిపత్రం అందజేశారు. రేణిగుంట మండలం తూకివాకం, పన్నీరుకాల్వ, కొత్తకాల్వ, కొట్రమంగళం, వీఆర్‌కండ్రిగ గ్రామాల ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను వివరించారు. ఎంపీ గురుమూర్తి స్పందిస్తూ సమస్య పరిష్కారానికి తనవంతు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఎంపీని కలిసిన వారిలో రేణిగుంట మాజీ జడ్పీటీసీ తిరుమలరెడ్డి, తూకివాకం ఎంపీటీసీ ఆనందరావు, వార్డు మెంబర్ శేఖర్‌రెడ్డి ఉన్నారు.

పాత పద్ధతిలోనే టైప్ పరీక్షలు నిర్వహించండి

తిరుపతి(విద్య), నవంబరు 24(ఆంధ్రజ్యోతి): టైప్ రైటింగ్ పరీక్షలను పాత విధానంలోనే నిర్వహించాలని జిల్లా టైప్ అండ్ షార్ట్‌హ్యాండ్ అసోసియేషన్ నాయకులు కోరారు. అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు కిరణ్, కార్యదర్శి భాస్కర్ మాట్లాడుతూ గతంలో ఆరు నెలలకొకసారి రెండు రోజులపాటు నాలుగు బ్యాచ్‌లుగా పరీక్షలు నిర్వహించేవారని తెలిపారు. 2026 నుంచి ఒక్క రోజులో నాలుగు బ్యాచ్‌లకు పరీక్షలు నిర్వహించాలని నిర్ణయించడం వల్ల విద్యార్థులు ఇబ్బంది పడుతున్నారని వివరించారు.

అదిగో ద్వారకా...ఇదిగో మురుగు!



ద్వారకానగర్‌లో పొంగిపొర్లుతున్న మురుగునీరు

తిరుపతి, నవంబరు24(ఆంధ్రజ్యోతి) : అది తిరుపతి కపిలతీర్థం సమీపంలోని ద్వారకా నగర్. వైద్యులు, అధికారులు, వ్యాపారవేత్తలు, ఓ స్కూల్ ఉండే ప్రాంతం. అక్కడ నిత్యం డ్రైనేజీ వరదలా పారుతూ ఉంటుంది. పెద్దపెద్ద ఇళ్లు కూడా హోమ్ స్టేలుగా మారిపోవడంతో నీటి వినియోగం పెరిగి మ్యాన్‌హోల్స్ తెరుచుకుంటున్నాయి. దీంతో మురుగు నీరు ఊటగా ఉబికి పైకొస్తోంది. దారిలో నడిచిపోవడం అటుంచితే ఇళ్లల్లో ఉండాలన్నా నరకం అనుభవిస్తున్నామని స్థానికులు వాపోతున్నారు. ఎన్జీవో కాలనీ, రామచంద్రనగర్, ద్వారకానగర్‌లో హోమ్ స్టేలు ఎక్కువ కావడంతో డ్రైనేజీ సమస్య పదేపదే ఉత్పన్నమవుతోందని చెబుతున్నారు. సోమవారం నగరపాలక సంస్థలో జరిగిన పీజీఆర్ఎస్‌లో స్థానికులు ఫిర్యాదు చేశారు. అధికారులకు ఫిర్యాదు చేసినప్పుడు తాత్కాలికంగా బాగుచేస్తున్నారని, మళ్లీ సమస్య ఉత్పన్నమవుతోందని తెలిపారు. డ్రైనేజీ వ్యవస్థను ప్రక్షాళన చేస్తే తప్ప శాశ్వత పరిష్కారం రాదని అంటున్నారు. ఆ దిశగా కార్పొరేషన్ చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి కృషి చేయాలి

● ఏఐసీసీ పరిశీలకురాలు సుధారామకృష్ణన్



తిరుపతి(వైద్యం), నవంబరు24(ఆంధ్రజ్యోతి): పార్టీని బలోపేతం చేసేందుకు కార్యకర్తలు కృషి చేయాలని ఏఐసీసీ పరిశీలకురాలు సుధారామకృష్ణన్ కాంగ్రెస్ నేతలకు దిశానిర్దేశం చేశారు. తిరుపతిలో సోమవారం నియోజకవర్గ నేతలు, కార్యకర్తల సమావేశానికి ఆమె ముఖ్య అతిథిగా హాజరయ్యారు. పార్టీకి పూర్వపు వైభవం నేతలు, కార్యకర్తల చేతుల్లోనే ఉందన్నారు. జిల్లాలోని ఆరు నియోజకవర్గాల్లో పర్యటించి, కార్యకర్తల సూచనలు, సలహాలు తీసుకున్నామన్నారు. అనంతరం జిల్లా అధ్యక్షుడు బాలగురువంబాబు, నగర అధ్యక్షుడు గౌడపేరు చిట్టిబాబు, నగర మాజీ అధ్యక్షుడు యార్లపల్లి గోపి ఆమెకు అభిప్రాయ సేకరణ దరఖాస్తులను అందించారు. ఈ కార్యక్రమంలో కేంద్ర మాజీ మంత్రి చింతా మోహన్, పీసీసీ పరిశీలకులు మదన్మోహన్, టిక్కిరాయల్, పీసీసీ ఉపాధ్యక్షుడు దొడ్డారెడ్డి రాంభూపాల్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి వెంకటనరసింహులు పాల్గొన్నారు.



మాల్వాడిగుండం వద్ద బోల్తాపడిన కారు

ప్రమాదానికి గురైన కారు

● ముగ్గురికి స్వల్ప గాయాలు

తిరుమల మొదటి ఘాట్‌రోడ్డులో సోమవారం ఓ కారు బోల్తాపడింది. తమిళనాడుకు చెందిన కుటుంబం దర్శనం పూర్తిచేసుకుని తిరుగు ప్రయాణం కాగా మాల్వాడి గుండంకు సమీపంలో కారు అదుపుతప్పి బోల్తాపడింది. ముగ్గురు భక్తులు స్వల్ప గాయాలతో బయటపడ్డారు.

- తిరుమల, ఆంధ్రజ్యోతి

టీటీడీకి రూ.20 లక్షల వినికిడి యంత్రాలు



టీటీడీకి రూ.20 లక్షల విలువైన 105 వినికిడి యంత్రాలు సోమవారం విరాళంగా అందాయి. తిరుపతికి చెందిన ఎన్ విరాట్ తిరుపతిలోని టీటీడీ పరిపాలన భవనంలో ఈవో అనిల్‌కుమార్ సింఘాల్‌కు వీటిని అందజేశారు. శ్రవణం ప్రాజెక్ట్‌లో శిక్షణ పూర్తిచేసుకుని బయటకు వెళ్లే పిల్లలకు ఈ వినికిడి యంత్రాలను అందజేస్తారు.

- తిరుమల, ఆంధ్రజ్యోతి

సర్వదర్శనానికి 10 గంటలు

తిరుమల వేంకటేశ్వరస్వామి దర్శనానికి 10 గంటల సమయం పడుతోంది. సోమవారం సాయంత్రం 4 గంటల వరకు ఉన్న సమాచారం మేరకు వైకుంఠం క్యూకాంప్లెక్స్2లో 31 కంపార్టుమెంట్లలో, నారాయణగిరిలోని 2 షెడ్లలో సర్వదర్శన భక్తులు, వైకుంఠం క్యూకాంప్లెక్స్1లో 4 కంపార్టుమెంట్లలో టైంస్లాట్ భక్తులు వేచి ఉన్నారు.

శనివారం హుండీ ఆదాయం: రూ.3.61 కోట్లు

ఆదివారం శ్రీవారిని దర్శించుకున్న భక్తులు: 78,974

తలనీలాలు సమర్పించినవారు: 28,995



మహారథంపై బ్రహ్మాండనాయకి



రథంపై చల్లిని మిరియాలు ఏరుకుంటున్న భక్తులు









ముత్యపు కవచపు అలంకారంలో.. సర్వస్వతంత్ర వీరలక్ష్మిగా పద్మావతి అమ్మవారు మహారథంపై ఊరేగుతూ భక్తులకు అభయమిచ్చారు. కార్తీక బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఎనిమిదో రోజైన సోమవారం ఉదయం అమ్మవారికి రథోత్సవం జరిగింది. ఈ సందర్భంగా వేకువజామున అమ్మవారిని మేల్కొలిపి నిత్యకైంకర్యాలు నిర్వహించారు. రథబలి కైంకర్యం నిర్వహించాక ఉత్సవమూర్తిని వేంచేపుగా రథమండపానికి తీసుకొచ్చారు. ఉదయం 9.15గంటలకు ధనుర్లగ్నంలో ముత్యపుకవచంతో ప్రసన్నమూర్తిగా అమ్మవారు రథంపై కొలువు దీరి భక్తులను కటాక్షించారు. భక్తుల గోవిందనామస్మరణల నడుమ ఆధ్యాత్మిక వాతావరణంలో రథం ముందుకుసాగింది. పెద్ద సంఖ్యలో భక్తులు రథాన్ని లాగారు. ఇక, రథంపై మిరియాలు, ఉప్పు చల్లి భక్తులు మొక్కులు తీర్చుకున్నారు. మధ్యాహ్నం 12.30 గంటలకు రథ మండపంలో అమ్మవారికి స్నపన తిరుమంజనం, సాయంత్రం ఆస్థాన మండపంలో ఊంజల్ సేవ నిర్వహించారు. - తిరుచానూరు, ఆంధ్రజ్యోతి









పుష్కరిణి వద్ద ఏర్పాట్ల పరిశీలన



తిరుచానూరు, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): తిరుచానూరులో మంగళవారం పంచమి తీర్థం జరగనుంది. ఈ నేపథ్యంలో జేఈవో వీరబ్రహ్మం, ఎస్పీ సుబ్బరాయుడు, సీవీఎస్వో మురళీకృష్ణ తదితరులు సోమవారం అమ్మవారి పుష్కరిణి, ఆలయ మాడవీధులు పరిశీలించారు. చక్ర స్నానం సందర్భంగా ఎస్డీఆర్ఎఫ్, ఎన్డీఆర్ఎఫ్ బృందాలు కూడా భద్రతా చర్యల్లో పాల్గొంటాయన్నారు. అంతకు ముందు శిల్పారామంలో బందోబస్తు విధులకు వచ్చిన పోలీసులకు ఎస్పీ దిశానిర్దేశం చేశారు. భక్తులతో మర్యాదగా మెలగాలని, చిన్న సంఘటన జరిగినా ఉన్నతాధికారులకు తెలియజేయాలన్నారు. పిల్లలు, వృద్ధులు ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలన్నారు.

నేడు ధ్వజావరోహణం, రేపు పుష్పయాగం

తిరుచానూరు, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): మంగళవారం రాత్రి బంగారు తిరుచ్చిపై అమ్మవారు తిరువీధుల్లో విహరిస్తారు. అనంతరం పాంచరాత్ర ఆగమశాస్త్రోక్తంగా ధ్వజ స్తంభంపై ఉన్న గజచిత్రపటాన్ని అర్చకులు అవరోహణ చేయడంతో బ్రహ్మోత్సవాలు ముగియనున్నాయి. బుధవారం సాయంత్రం అమ్మవారికి పుష్పయాగం నిర్వహించనున్నారు. భక్తులు టిక్కెట్లు కొని పాల్గొనవచ్చు.

నేడు బంగారు చీరలో అమ్మవారి దర్శనం

పంచమితీర్థం సందర్భంగా అమ్మవారు మంగళవారం బంగారు చీరలో భక్తులకు దర్శనమివ్వనున్నారు. 12 ఏళ్ల కిందట రూ.3 కోట్ల విలువ చేసే ఈ బంగారు పట్టుచీరను గుంటూరుకు చెందిన ఓ దాత సమర్పించారు. అప్పటి నుంచి బంగారు చీరను అమ్మవారికి కడుతున్నారు.

నేడు అమ్మవారికి అయ్యవారి సారె

తిరుమల/తిరుచానూరు, నవంబరు24(ఆంధ్రజ్యోతి): పంచమితీర్థం సందర్భంగా తిరుమల శ్రీవారి తరపున మంగళవారం అమ్మవారికి సారె పంపనున్నారు. శ్రీవారి ఆలయం నుంచి వేకువజామున పసుపు, కుంకుమ, ప్రసాదాలు, తులసి, వస్త్రాలు, ఆభరణాలతో కూడి సారెను ఆలయ నాలుగు మాడవీధుల గుండా ఊరేగిస్తారు. ఈ సారెతో టీటీడీ ఈవో అనిల్‌కుమార్ సింఘాల్, ఏకాంగులు, అర్చకులు, పరిచారకులు కాలిమార్గాన అలిపిరికి చేరుకుంటారు. అక్కడ వారికి అమ్మవారి ప్రతినిధిగా తిరుపతి జేఈవో వీరబ్రహ్మం స్వాగతం పలుకుతారు. అక్కడి నుంచి ఏనుగు అంబారిపై ఊరేగింపుగా కోమలమ్మ సత్రం, కోదండరామాలయం, గోవిందరాజస్వామి ఆలయం, ఆర్టీసీ బస్టాండు, లక్ష్మీపురం మీదుగా అమ్మవారి ఆలయానికి.. అక్కడ్నుంచి పంచమితీర్థం మండపానికి తీసుకొస్తారు. సారెలోని పసుపు, చందనం తదితరాలతో ఉత్సవమూర్తి, చక్రత్తాళ్వార్‌కు స్నపన తిరుమంజనం నిర్వహిస్తారు.

నేడు ఎస్వీయూకు సెలవు

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): పంచమి తీర్థం సందర్భంగా ఎస్వీయూకు మంగళవారం సెలవు ప్రకటించారు. ఈ మేరకు రిజిస్ట్రార్ మాదాల భూపతి నాయుడు ఉత్తర్వులు జారీ చేశారు.

పంచమితీర్థానికి 40బస్సులు

తిరుపతి(ఆర్టీసీ), నవంబరు 24(ఆంధ్రజ్యోతి): తిరుచానూరులో మంగళవారం జరిగే పంచమితీర్థానికి హాజరయ్యే భక్తులకోసం 40 బస్సులు ఏర్పాటు చేసినట్లు ఆర్టీసీ డిప్యూటీ సీటీఎం విశ్వనాథం తెలిపారు. ఉదయం 5 గంటల నుంచి సీబీఎస్‌లో ఈ బస్సులు అందుబాటులో ఉంటాయన్నారు. బస్టాండు, లక్ష్మీపురం కూడలి, మామిడికాయల మండీ, జాతీయ రహదారి, ఫ్లైఓవర్ బ్రిడ్జి నుంచి తిరుగు ప్రయాణమవుతాయన్నారు నిమిషానికో బస్సు అందుబాటులో ఉంటుందన్నారు.

ప్రతి అర్జీకీ పరిష్కారం చూపాలి



● కలెక్టరేట్ పీజీఆర్ఎస్‌కు 288 వినతులు

తిరుపతి(ఎంఆర్‌పల్లె), నవంబరు 24(ఆంధ్రజ్యోతి): కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక(పీజీఆర్ఎస్)కు 288 వినతులు వచ్చాయి. అందులో రెవెన్యూ శాఖవే 196 ఉన్నాయి. ఈ వినతులను పరిష్కరించాల్సిన బాధ్యత అధికారులపై ఉందని కలెక్టర్ వెంకటేశ్వర్ అన్నారు. ట్రైనీ కలెక్టర్ సందీప్ రఘువంశీ, డీఆర్వో నరసింహులు, ఇతర అధికారులు అర్జీలు స్వీకరించారు.

వినతులు స్వీకరిస్తున్న కలెక్టర్ వెంకటేశ్వర్, ట్రైనీ కలెక్టర్ సందీప్ రఘువన్షి, డీఆర్వో నరసింహులు

నకిలీ పాసుపుస్తకాలతో భూమి కాజేయాలని చూస్తున్నారు



సర్వే నెంబరు 35/2లోని భూములను మేము కొన్నేళ్లుగా సాగు చేసుకుంటున్నాం. పుత్తూరుకు చెందిన ఎంఎస్ కదిరివేలు ఆ భూములకు నకిలీ పాసుపుస్తకాలు సృష్టించి మమ్మల్ని రానివ్వకుండా చేస్తున్నారు. దౌర్జన్యానికి పాల్పడుతున్నాడు. అతడిపై చర్యలు తీసుకుని మాకు న్యాయం చేయండి.

- గోపాలకృష్ణాపురం ఎస్టీకాలనీవాసులు, పుత్తూరు మండలం

మా భూమిని ఆక్రమించాలని చూస్తున్నారు

తిరుచానూరు గ్రామ పరిధిలోని యోగిమల్లవరం సర్వే నెంబరు 11లో నాకు నాలుగు సెంట్ల స్థలముంది. 2.5 సెంట్లలో ఇల్లు కట్టుకుని, మిగిలిన దాంట్లో ఆవుల కోసం రేకుల షెడ్డు ఏర్పాటు చేసుకున్నా. అందులో 1.50సెంట్లు పక్కనే ఉన్న పొక్కాలమ్మ గుడికి చెందిందని చెప్పి నన్ను ఇబ్బంది పెడుతున్నారు. విచారించి న్యాయం చేయండి.

- నారాయణ, యోగిమల్లవరం, తిరుచానూరు పంచాయతీ

రీ వెరిఫికేషన్‌తో మనోభావాలు దెబ్బతీశారు

గతంలో సదరం సర్టిఫికెట్లలో 70 శాతానికిపైగా వికలత్వం ఇచ్చారు. రీవెరిఫికేషన్ పేరుతో ఇప్పుడు దాన్ని 50 శాతానికి తగ్గించి మా మనోభావాలను దెబ్బతీశారని దివ్యాంగుల సేవా సమితి సభ్యులు శ్రీనివాసరావు, కోటేశ్వరరావు, మురళి, శోభన్‌బాబు అధికారులు దృష్టికి తీసుకెళ్లారు. మున్సిపాలిటీ పరిధిలో సెల్ఫ్ ఎంప్లాయిమెంట్ సర్టిఫికెట్లపై అధికారులు సంతకం పెట్టడం లేదని, మూడు చక్రాల మోటార్ సైకిళ్ల దరఖాస్తుకు గడువు పెంచాలని కోరారు.



జూనియర్ కళాశాలకు ప్రహరీ నిర్మించండి

పిచ్చాటూరు ప్రభుత్వ జూనియర్ కళాశాలకు ప్రహరీ నిర్మించాలని సత్యవేడు ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం కోరారు. ఈ మేరకు పీజీఆర్ఎస్‌లో కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. ప్రహరీ లేకపోవడంతో రాత్రిళ్లు అసాంఘిక కార్యకలాపాలు జరుగుతున్నాయని, విష పురుగులు చొరబడుతున్నాయన్నారు.

ఉద్యోగ భద్రత కల్పించాలి : ఏపీ సమగ్రశిక్ష కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులకు ఉద్యోగ భద్రత కల్పించాలని, జీతాలు పెంచాలని ఫెడరేషన్ జేఏసీ నాయకులు కోరారు. ఈ మేరకు కలెక్టరేట్ వద్ద ధర్నా చేశారు. హెచ్ఆర్ పాలసీ అమలు చేయాలని, జీతాలు పెంచి సమయానికి చెల్లించేలా చర్యలు తీసుకోవాలని కోరారు.రిటైర్‌మెంట్ వయసు 62కు పెంచాలన్నారు. అధికారులకు వినతిపత్రం అందజేశారు.

ఇళ్ల పట్టాలివ్వండి : తాము రెండేళ్ల క్రితం నిర్మించుకున్న ఇళ్లకు పట్టాలివ్వాలని వెంకటగిరి మండలం పెట్లూరు పంచాయతీ సీతారాం ఏచూరి నగర్ వాసులు కోరారు. సర్వే నెంబరు 12/1లో 2011 నుంచి నివాసముంటున్నా పట్టా ఇవ్వలేదని తెలిపారు. పంచాయతీ కార్యదర్శి అది రిజర్వ్ ఫారెస్టుగా ఉన్నతాధికారులకు నివేదిక ఇచ్చారని పేర్కొన్నారు. అది పశువుల మేత భూమిగా తహసీల్దారు ఎండార్స్‌మెంట్ కాపీని తమకు ఇచ్చారని వివరించారు. అనాధీనంగా మార్చి తమకు ఇళ్ల పట్టాలు మంజూరు చేయాలని కోరారు.

పెచ్చులూడిన కలెక్టరేట్ మెట్లు



కలెక్టరేట్‌లో సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం జరుగుతుండగా మధ్యాహ్నం 12.20 గంటల సమయంలో బ్లాక్ బి వద్ద మొదటి అంతస్థుకు వెళ్లేమార్గంలో మెట్లు పెచ్చులూడి పడ్డాయి. దీంతో అధికారులు, అర్జీదారులు ఉలిక్కిపడ్డారు. ఆ సమయంలో అక్కడ ఎవరూ లేకపోవడం ప్రమాదం తప్పింది.

వినుత దంపతులే హతమార్చి ఉంటారు!

● రాయుడి సోదరి కీర్తిప్రియ ఆరోపణ



శ్రీకాళహస్తి, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): తన అన్న రాయుడు అలియాస్ శ్రీనివాసులును శ్రీకాళహస్తి జనసేన నియోజకవర్గ మాజీ ఇన్‌ఛార్జి వినుత వాళ్లే హతమార్చి ఉంటారని కీర్తిప్రియ ఆరోపించారు. దీనిపై సోమవారం ఆమె వీడియో విడుదల చేశారు. 'వినుత వాళ్లే మా అన్న రాయుడిని హత్య చేసి ఉంటారని బలంగా అనుమానిస్తున్నా. ఎమ్మెల్యే సుధీర్‌పై వినుత దంపతుల ఆరోపణలకు ఎలాంటి పొంతన కుదరడం లేదు. ఎమ్మెల్యే పాత్ర నిజమైతే రాయుడిని చంపకుండా సాక్ష్యాలను బహిర్గతం చేసి ఉండొచ్చు. అలా కాకుండా అప్పుడప్పుడు వీడియోలను వదులుతూ ఆరోపణలు చేయడంపై అనుమానం కలుగుతోంది. ఎన్నో లక్షలు ఖర్చు పెట్టి రాయుడి వీడియోలను రికవరీ చేశామని వినుత వర్గం చెప్పుకోవడం ద్వారా.. వాళ్లే చనిపోయిన రాయుడు వీడియోలను సృష్టిస్తున్నారన్న అనుమానం వస్తోంది. ఈ హత్యకేసును లోతుగా దర్యాప్తు చేసి నిందితులను కఠినంగా శిక్షించాలి' అని ఆ వీడియోలో ఆమె కోరారు.

తిరుపతి రైల్వే స్టేషన్ పనులు త్వరితగతిన పూర్తి చేయాలి

● సీపీఎం మాజీ ఎంపీ మధు

తిరుపతి(ఆటోనగర్), నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): తిరుపతి రైల్వే స్టేషన్‌లో జరుగుతున్న అభివృద్ధి పనులు త్వరిత గతిన పూర్తి చేసి ప్రయాణికులకు అందుబాటులోకి తేవాలని సీపీఎం మాజీ ఎంపీ మధు డిమాండు చేశారు. తిరుపతిలోని తిరుపతిలోని సీపీఎం కార్యాలయంలో సోమవారం ఆయన మీడియాతో మాట్లాడారు. రాష్ట్రాన్ని అదానీ ప్రదేశ్‌గా ప్రభుత్వం మార్చేస్తోందని ఆరోపించారు. 'పట్టణ ప్రాంతాల్లో రోడ్లు, మంచినీటి సరఫరా, పారిశుధ్యం తదితరాలను ప్రైవేటు సంస్థలకు అప్పగించి ప్రభుత్వం తీవ్ర నష్టం కలిగిస్తోంది. రాష్ట్రంలో రూ6400 కోట్ల ఫీజు రీయింబర్స్‌మెంట్ చేయక 60 డిగ్రీ కళాశాలలు మూత పడ్డాయి. అధికారంలోకి వచ్చిన వంద రోజుల్లో ఫీజ్ రీయింబర్స్‌మెంట్ చేస్తామన్న లోకేశ్ హామీ ఏమైంది? ఆరోగ్యశ్రీ పథకానికి రూ.మూడు వేల కోట్ల బకాయిలతో వైద్యం చేయలేమని ఆస్పత్రి యాజమాన్యాలు ప్రకటించాయి. విశాఖ స్టీల్ పక్కనే మరో ప్రైవేటు స్టీల్ ఫ్యాక్టరీకి అనుమతులివ్వడానికి, ఎంపీలచే గనులు కేటాయించమని సీఎం చంద్రబాబు కేంద్రం చుట్టూ తిరగడం దేనికి సంకేతం?' అంటూ కూటమి ప్రభుత్వంపై విమర్శలు చేశారు.



మాట్లాడుతున్న సీపీఎం మాజీ ఎంపీ మధు

సైన్స్ టాలెంట్ సెర్చ్ పోటీల్లో ప్రతిభ


విద్యార్థులను అభినందిస్తున్న ఉపాధ్యాయులు

గూడూరు, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): జనవిజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో ఆదివారం తిరుపతి లోని సైన్స్‌సెంటర్ లో నిర్వహించిన జిల్లాస్థాయి సైన్స్ టాలెంట్ సెర్చ్ పోటీల్లో చెన్నూరు జడ్పీ బాలుర ఉన్నత పాఠశాల విద్యార్థులు ప్రతిభచాటారు. జిల్లాస్థాయిలో ప్రథమ స్థానంలో నిలిచారు. ఈ సందర్భంగా సోమవారం స్థానిక పాఠశాలలో పాఠశాల హెచ్ఎం బాలనాగమ్మ మాట్లాడుతూ తరుణ్‌కుమార్, ఆదిత్యా, నాహీద్‌అహ్మద్‌లు రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారన్నారు. ద్యార్థులను అభినందించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు వీరాస్వామి, లోకేశ్వరి పాల్గొన్నారు.

దివ్యాంగుల సమస్యలను పరిష్కరించాలి


సబ్‌కలెక్టర్ ఆఫీస్ వద్ద దివ్యాంగ నాయకుల నిరసన

గూడూరు, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): దివ్యాంగుల సమస్యలను పరిష్కరించేలా రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని వైసీపీ దివ్యాంగుల విభాగం జిల్లా అ.ధ్యక్షుడు మోహన్ అన్నారు. సోమవారం స్థానిక సబ్‌కలెక్టర్ కార్యాలయం వద్ద వైసీపీ దివ్యాంగుల విభాగం అధ్వర్యంలో నిరసన వ్యక్తం చేశ్తారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దివ్యాంగుల విభాగంలో ఖాళీ పోస్టులను వెంటనే భర్తీ చేయాలన్నారు. ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పించాలన్నారు. కార్యాలయ ఏవో శిరీషకు వినతిపత్రంఅందజేశారు. కార్యక్రమంలో నాగేంద్ర, శుభాన్‌బాషా, ప్రభుదాస్, పోలయ్య, తులసి పాల్గొన్నారు.

జాతీయ హ్యాండ్‌బాల్ పోటీలకు ఎంపిక


కార్తికేయను అభినందిస్తున్న ఉపాధ్యాయులు

చిల్లకూరు, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): జాతీయస్థాయి హ్యాండ్‌బాల్ పోటీలకు స్థానిక డాక్టర్ అంబేడ్కర్ గురుకులంలో 10వ తరగతి చదువుతున్న కార్తికేయ ఎంపికైనట్లు గు రుకులం ప్రిన్సిపాల్ అనిల్‌కుమార్ తెలిపారు. ఈసందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ తెనాలిలో నిర్వహించిన ఎస్‌జీఎఫ్ రాష్ట్రస్థాయి హ్యాండ్‌బాల్ పోటీల్లో అండర్-17 విభాగంలో కార్తికేయ ఉత్తమ ప్రతిభ కనబరిచాడన్నారు. కర్ణాటకలో ఈనెల 25 నుంచి 29వ వరకు జరిగే జాతీయస్థాయి పోటీలలో పాల్గొంటాడన్నారు. హెచ్ఎం, పీడీ శ్రీరేష్, పీఈటీ రాజజేంద్ర, ఉపాధ్యాయులు ఆ విద్యార్థిని అభినందించారు.

ఆక్రమణలను అడ్డుకోవాలని వినతి


స్థానికులు ఇచ్చిన వినతిపత్రాన్ని పరిశీలిస్తున్న మున్సిపల్ కమిషనర్ వెంకటేశ్వర్లు

గూడూరు, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): స్థానిక విఘ్నేశ్వరపురం సమీపంలో మున్సిపాలిటీ స్థలాన్ని ఆక్రమించుకునేందుకు కొందరు చేస్తున్న ప్రయత్నాలను అడ్డుకోవాలని స్థానికులు కోరారు. సోమవారం స్థానిక మున్సిపల్ కార్యాలయంలో మున్సిపల్ కమిషనర్ వెంకటేశ్వర్లుకు విఘ్నేశ్వరపురం వాసులు కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మున్సిపల్ స్థలాన్ని ఆక్రమించుకుని దుకాణాలను నిర్మించేందుకు ప్రయత్నాలు చేస్తున్నారన్నారు. అధికారులు విచారించి ఆక్రమణలను అడ్డుకోవాలని సందీప్, ఓంప్రకాష్, వంశీ తదితరులు కోరారు.

ఎన్టీఆర్ విగ్రహ ఏర్పాటుకు రూ.లక్ష విరాళం


విరాళం అందజేస్తున్న గాంధీనాయుడు

నాయుడుపేట టౌన్, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని సీఎస్‌తేజ సెంటర్ వద్ద దివంగత ముఖ్యమంత్రి ఎన్టీ రామారావు విగ్రహం ఏర్పాటుకు పట్టణానికి చెందిన టీడీపీ సీనియర్ నాయకుడు కోట్లపాటి గాంధీనాయుడు లక్ష రూపాయల విరాళం ప్రకటించారు. ఈ మొత్తాన్ని టీడీపీ నాయకులు, మున్సిపల్ వైస్ చైర్మన్ రఫీకి సోమవారం అందజేశారు. అనంతరం గాంధీనాయుడు మాట్లాడుతూ విగ్రహ నిర్మాణ పనుల్లో భాగంగా స్టీల్ వర్క్‌కు ఈ నగదును అందజేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు గుంటూరు లక్ష్మయ్య, ఈతముక్కల వెంకటసుబ్బానాయుడు, గుంటూరు లక్ష్మయ్య, గోపీ, రవి, తదితరులు ఉన్నారు.

రైతులకు యూరియా పంపిణీ



డక్కిలి, నంవంబర్ 24(ఆంధ్రజ్యోతి):స్థానిక రైతు భరోసా కేంద్రంలో దేవునివెలంపల్లి పంచాయతీకి చెందిన రైతులకు సోమవారం యూరియా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాదవాయపాలెం సింగిల్ విండో అధ్యక్షుడు ఏలేశ్వరం రామచంద్రానాయుడు మాట్లాడుతూ రైతులకు సమయానికి ఎరువులు అందేలా అధికారులు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. యూరియా కొరత అనేది వైసీపీ తప్పుడు ప్రచారమని విమర్శించారు. ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ సహకారంతో రైతులకు అవసరమైన యూరియా అందుబాటులో ఉందన్నారు. కార్యక్రమంలో వెటర్నరీ డాక్టర్ కిషోర్, వ్యవసాయ ఏవో శిరీష, టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

కుష్ఠువ్యాధి నిర్ధారణ పరీక్షలు


పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు

వెంకటగిరి, నవంబర్ 24(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని కాశీవిశ్వనాథ దేవస్థానం వద్ద సోమవారం పాతకోట సీహెచ్‌సీ ఆధ్వర్య ంలో కుష్ఠువ్యాధి నిర్ధారణా పరీక్షలు ని ర్వహించారు. వైద్యాధికారి రాజేష్ మాట్లాడుతూ జాతీయ కుష్ఠ వ్యాది నిర్మూలనా కార్యక్రమంలో భాగంగా ఈ నెల 30 వరకు పట్టణంలోని 14 సచ్చివాలయాల పరిధిలో కుష్ఠువ్యాధి మచ్చలపై సర్వే నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఏఎన్ఎంఎస్ సత్యవేణి, హైమావతి, రమణమ్మ ఉన్నారు.

ఉద్యోగాలకు 395 మంది ఎంపిక


ఎంపికైన విద్యార్థులతో కళాశాల సిబ్బంది

గూడూరు, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): గూడూరు, నెల్లూరుల్లో తమ కళాశాలలకు చెందిన 395 మంది విద్యార్థులు వివిధ కంపెనీల ఆధ్వర్యంలో జరిగిన క్యాంపస్ ఎంపికల్లో ప్రతిభ కనబరిచారని నారాయణ ఇంజనీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ విశ్వక్సేనారెడ్డి తెలిపారు. సోమవారం కళాశాలలో పలు కంపెనీల ఆధ్వర్యంలో క్యాంపస్ ఎంపికలు జరిగాయి. కార్యక్రమంలో వినయ్‌కుమార్, దత్తాత్రేయశర్మ, రాజేష్‌రెడ్డి, సందీప్‌రెడ్డి, కొండారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రైలు ఢీకొని గుర్తు తెలియని వ్యక్తి మృతి

తడ, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి) : రైలు ఢీకొని ఓవ్యక్తి మృతి చెందాడు. రైల్వే పోలీసులు కథనం మేరకు అక్కంపేట రైల్వే స్టేషన్ సమీపంలో సోమవారం మధ్యాహ్నం రైలు పట్టాలను దాటుతున్న ఓ వ్యక్తిని అయోధ్య వెళ్తున్న శ్రద్ధసేతు ఎక్స్‌ప్రెస్ ఢీకొంది. గుర్తు తెలియని ఆ వ్యక్తి వెంటనే మృతి చెందాడు. మృతుడికి 25-30 సంవత్సరాల వయసుంటుంది. ఎలాంటి ఆధారాలు లభించలేదు. మృతదేహాన్ని సూళ్లూరుపేట ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని జీఆర్‌పీ పోలీసులు తెలిపారు.

29న టిడ్కో హౌసింగ్ రుణమేళా

నాయుడుపేట, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలో ఈ నెల 29న టిడ్కో హౌసింగ్ రుణమేళా నిర్వహిస్తున్నట్లు మున్సిపల్ కమిషనర్ ఫజులుల్లా ఓ ప్రకటనలో తెలిపారు. పాత బస్టాండ్ సమీపంలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ భవనంలో ఈ కార్యక్రమం జరగుతుందన్నారు. టిడ్కోలో 365, 430 చదరపు అడుగులకు సంబంధించి బ్యాంక్ రుణం పొందని ఇళ్ల లబ్ధిదారులకు ఈ రుణమేళా ఉపకరిస్తుందన్నారు. ఆధార్ కార్డు,పాన్‌కార్డు, బ్యాంక్ పాస్‌బుక్కు, పాస్‌పోర్టుసైజు ఫోటోలు రెండు, టిడ్కో ఇళ్ల ఏర్పాటు పత్రం(ఒరిజినల్) వెంట తీసుకురావాలని ఆయన సూచించారు.

వృద్ధులకు అన్నదానం

గూడూరు అర్బన్, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): స్థానిక సాయిరాం చారిటీస్ వృద్ధాశ్రమంలో సోమవారం ఇనుకుర్తి శ్రీనివాసులునాయుడు సహకారంతో వృద్ధులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో శ్రీహరి, శ్రీలక్ష్మీ, సునీల్, అమరయ్య, నరసింహులునాయుడు, వెంకటేశ్వర్లునాయుడు, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

నేడు రావులపాడులో ఎమ్మెల్యే పర్యటన

పెళ్లకూరు, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి):మండలంలోని రావులపాడు గ్రామాన్ని మంగళవారం ఎమ్మెల్యే డాక్టర్ నెలవల విజయశ్రీ సందర్శించనున్నట్లు టీడీపీ మండల అధ్యక్షుడు సంచి కృష్ణయ్య తెలిపారు. కూటమి ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తున్న రైతన్నా మీకోసం కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొంటారన్నారు. కార్యక్రమంలో అన్ని శాఖల అధికారులు, టీడీపీ శ్రేణులు, రైతులు పాల్గొన్నాలని కోరారు.

చికిత్స పొందుతూ మహిళ మృతి

నాయుడుపేట టౌన్, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి) : నాయుడుపేట-శ్రీకాళహస్తి బైపాస్‌రోడ్డు సమీపంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడి చికిత్స పొందుతూ శ్రావణి (31) అనే మహిళ మృతి చెందినట్లు అర్బన్ సీఐ బాబి తెలిపారు. ఈ నెల 10న మోటారు సైకిల్‌ను కర్మాగారం బస్సు ఢీ కొన్న సంఘటనలో ఈమె తీవ్రంగా గాయపడింది. మెరుగైన వైద్యసేవల కోసం సిమ్స్‌కు తరలించగా చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందినట్లు సీఐ పేర్కొన్నారు.

అర్జీలను పరిష్కరిస్తాం: ఆర్డీవో


అర్జీలు స్వీకరిస్తున్న కిరణ్మయి

సూళ్లూరుపేట, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): ప్రజలు వివిధ సమస్యలపై గ్రీవెన్స్‌లో ఇచ్చే అర్జీలను పరిశీలించి పరిష్కరిస్తామని ఆర్డీవో కిరణ్మయి అన్నారు. సోమవారం డివిజన్ పరిధిలో తొమ్మిది అర్జీలు వచ్చాయని పేర్కొన్నారు. గ్రీవెన్స్‌డే కార్యక్రమాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. తహసీల్దార్ కార్యాలయంలో గ్రీవెన్స్‌డేకు ఒక అర్జీ వచ్చినట్లు తహసీల్దార్ గోపినాథ్ రెడ్డి తెలిపారు

ఏకగ్రీవంగా ఎన్జీవో కార్యవర్గ ఎన్నిక


కార్యవర్గంచేత ప్రమాణం చేయిస్తున్న సురేష్‌బాబు

సూళ్లూరుపేట, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): ఏపీ ఎన్జీవో అసోసియేషన్ తాలూకా ఎన్నికలు ఏకగ్రీవమయ్యాయి. సోమవారం స్థానిక ప్రభుత్వ వైద్యశాల ఆవరణలో జరిగిన ఎన్నికల ప్రక్రియలో సూళ్లూపేట తాలూక ఏపీ ఎన్జీవో అసోసియేషన్ అధ్యక్షుడిగా సగుటూరు జనార్దన్, కార్యదర్శిగా అనుదీప్, ట్రెజరర్‌గా అరుణ్ కుమార్, వైస్ ప్రెసిడెంట్లుగా కె.గిరిబాబు, రవి కుమార్, రాకేష్, జాయింట్ సెక్రటరీగా ఎం.నాగరాజు, వెంకటేశ్వర్లు, వాసుదేవయ్య, మహిళా జాయింట్ సెక్రటరీగా బి.పుష్పలత, అసోసియేట్ ప్రెసిడెంట్‌గా కె.సాల్మన్ రాజులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు ఎన్నికల అధికారి శ్రావణ్ కుమార్ ప్రకటించారు. సహాయ ఎన్నికల అధికారిగా ఫణీంద్ర కుమార్, పరిశీలికులుగా లలిత్ కుమార్‌లు వ్యవహరించారు. నూతన కార్యవర్గ సభ్యులచే జిల్లా ఎన్జీవో అధ్యక్షుడు సురేష్‌బాబు ప్రమాణ స్వీకారం చేయించారు.

ఉచిత కంటి వైద్య శిబిరం

కోట, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని షిరిడీ సాయిబాబా మందిరంలో సోమవారం చెందోడుకు చెందిన ఎంవీరావు ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఉచిత కంటి వైద్య శిబిరం జరిగింది. నెల్లూరు వాసన్ ఐకేర్ ఆధ్వర్యంలో ఈ శిబిరం నిర్వహించారు. కంటి వైద్య నిపుణులు రవికుమార్, ఈశ్వర్, పవన్‌లు రోగులకు ఉచిత కంటి పరీక్షలు నిర్వహించి దృష్టి లోపం ఉన్నవారిని గుర్తించారు. 25 మందికి ఉచితంగా కంటి ఆపరేషన్లు చేస్తామని ఎంవీరావు ఫౌండేషన్ ప్రతినిధులు లీలామోహన్, విజయలక్ష్మి తెలిపారు.

రేపు దివ్యాంగ క్రీడా పోటీలు

తిరుపతి(క్రీడలు), నవంబరు 24(ఆంధ్రజ్యోతి): డిసెంబర్ 3న అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవం సందర్భంగా బుధవారం జిల్లాస్థాయి దివ్యాంగ క్రీడా పోటీలు నిర్వహించనున్నట్లు డీఎస్‌డీవో శశిధర్ ఒక ప్రకటనలో తెలిపారు. శ్రీనివాస క్రీడా సముదాయం, ఎస్వీ తారకరామ మైదానం వేదికలలో బ్యాడ్మింటన్, చెస్, అథ్లెటిక్స్, లాంగ్‌జంప్, ఫుట్‌బాల్, వాలీబాల్ పోటీలు జరుగుతాయని పేర్కొన్నారు. ఆసక్తిగలవారు మరిన్ని వివరాల కోసం 9966882029, 9059606346లను సంప్రదించాలని కోరారు.

నైపుణ్యాలపై శిక్షణ

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): పద్మావతి వర్సిటీ సోషల్ వర్క్ - క్లినికల్ సైకాలజీ విభాగం సంయుక్తంగా నైపుణ్య శిక్షణా కార్యక్రమం చేపట్టారు. ఇందులో నిపుణులు కౌన్సిలింగ్ ప్రక్రియలో అవసరమైన ప్రాథమిక నైపుణ్యాలపై శిక్షణ అందించారు. వినడం, పరిశీలన, సానుభూతి వంటి అంశాలతో పాటు ఎదుటి వారి ఆలోచనలను అంచనా వేయడంపై అవగాహన కల్పించారు. పలువురు అధికారులు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

యూరియా...ఈ తీరు బాగలేదయా..

- సాగులేని భూములకూ గుర్తింపు కార్డులా..?
- అధికారులకు కొందరు నాయకుల సిఫార్సులు


దామానెల్లూరు పరిధిలో ఫారెస్ట్ భూమికి ఇచ్చిన గుర్తింపు కార్డు


సూళ్లూరుపేటలో యూరియా తీసుకువెళ్తున్న రైతులు

సూళ్లూరుపేట, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): యూరియా గుర్తింపు కార్డుల్లో కొందరు వ్యవసాయశాఖ అధికారుల తీరు విమర్శలకు దారితీస్తోంది. సాగులో లేని, అటవీ, చెరువు, కాలువ పొరంబోకు భూములకు కూడా కార్డులను జారీ చేయడం ఇబ్బందులు కలిగిస్తోంది. ఫలితంగా అసలైన రైతులు నష్టపోతున్నారు. మంగళంపాడు, దామానెల్లూరు, మంగానెల్లూరు సచివాలయ పరిధిలో ఈ వ్యవహారం నడుస్తున్నట్లు తెలిసింది. రబీ సీజన్ అదును దాటిపోతోందని రైతులు యూరియా కోసం పడిగాపులు పడుతున్నారు. గుర్తింపు కార్డులున్న వారికే యూరియా అందజేస్తామనే నిబంధన వీరికి ప్రతిబంధకమైంది. దీంతో కార్డుల కోసం కార్యాలయాలు, నాయకుల చుట్టూ తిరుగుతున్నారు. సాగు వివరాలు ఆధారంగా వ్యవసాయశాఖ అధికారులు గుర్తింపు కార్డులు జారీ చేయాలి. అయితే కార్డుల ప్రక్రియలో కొందరు అధికారులు ఒత్తిళ్లకు లొంగుతున్నారు. ముఖ్యంగా గ్రామాల్లో కొందరు విస్తరణ అధికారులు పలుకుబడి ఉన్న రాజకీయ నాయకుల సిఫార్సు చేసిన వారికి సాగేతర భూములకు గుర్తింపు కార్డులను ఇచ్చేస్తున్నారని తెలిసింది. కొందరు నాయకులు నకిలీ కార్డుల ద్వారా యూరియా పొంది నిల్వచేసుకుంటున్నారనే విమర్శలున్నాయి. దీంతో చిన్న, కౌలు రైతులు నష్టపోతున్నారు. తాజాగా దామానెల్లూరు, మంగానెల్లూరు, ఉగ్గుముడి గ్రామాల్లో అటవీ భూములు కూడా సాగుగా గుర్తించి కార్డులు ఇచ్చారనే ఆరోపణలున్నాయి. ఆ కార్డుల ద్వారా సెంటు భూమిలేని వారు కూడా యూరియా తీసుకెళ్తున్నారు. మండలంలో మూడు విడతలుగా 22 మెట్రిక్ టన్నులు ఎరువు అందజేసినట్లు రికార్డులు చెబుతున్నా కొన్ని ప్రాంతాల్లో తమకు అందలేదని రైతులు అంటున్నారు. మరోపక్క ఇదే అదనుగా ప్రైవేట్ డీలర్లు ఇష్టానుసారంగా యూరియా అధిక ధరలకు విక్రయిస్తున్నారు. విక్రయాలపై పర్యవేక్షణ కరువైందని రైతులు ఆవేదన చెందుతున్నారు.

రైతుల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

రైతన్నా మీకోసం కార్యక్రమాల్లో ఎమ్మెల్యేలు


రైతుతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే సునీల్‌కుమార్


రైతులకు కరపత్రం అందజేస్తున్న ఎమ్మెల్యే విజయశ్రీ

గూడూరు, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): రైతుల సంక్షేమమే రాష్ట్ర ప్రభుత్వ ధ్యేయమని ఎమ్మెల్యే పాశిం సునీల్‌కుమార్ అన్నారు. సోమవారం పోటుపాళెంలో రైతన్నా మీకోసం కార్యక్రమంలో పాల్గొన్నారు. రైతుల ఇళ్లను సందర్శించి ప్రభుత్వం అమలు చేస్తున్న వ్యవసాయ పథకాలపై అవగాహన కల్పించారు. కరపత్రాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈనెల 29 వరకు ఈ కార్యక్రమాన్ని చేపడుతున్నామన్నారు. అన్నదాతసుఖీభవ పథకం ద్వారా ప్రభుత్వం మూడు విడతల్లో రైతులకు తోడ్పడుతోందన్నారు. కార్యక్రమంలో వ్యవసాయశాఖ ఏడీ గోపీనాయక్, పశుసంవర్థకశాఖ ఏడీ డాక్టర్ సురేష్, నాయకులు పులిమి శ్రీనివాసులు, వెంకటేశ్వర్లురాజు, మట్టం శ్రావణి, ఎల్లసిరి శ్రీనివాసులురెడ్డి, పట్టాభిరామిరెడ్డి, కొండా రామచంద్రారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

దొరవారిసత్రం: వేటగిరిపాళెంలో రైతన్నా మీ కోసం కార్యక్రమాన్ని ఎమ్మెల్యే విజయశ్రీ ప్రారంభించారు. వ్యసాయాధికారులు ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పాల్గొన్న ఆమె రైతులతో మాట్లాడారు. ప్రభుత్వ ఆలోచన విధానాలను రైతులకు వివరించారు. రసాయనిక ఎరువుల వాడకంను క్రమేప తగ్గించుకొంటూ రావాలని సూచించారు. రైతన్నకు అండగా ప్రభుత్వం చేపడుతున్న కార్యక్రమాలను ఆమె వివరించారు. కరపత్రాలను అందజేశారు. కార్యక్రమంలో తహసీల్థారు శైలాకుమారి, ఏవో జ్యోతిర్మయి, నాయకులు ముప్పాళ్ల శ్రీహరిరెడ్డి, విజయ్‌కుమార్, నాగేంద్రనాయుడు, మనోహర్‌రెడ్డి, ప్రమీలమ్మ, పామంజి వెంకట్ పాల్గొన్నారు.

ఏఎంసీ అభివృద్ధికి నిధులు కేటాయించండి


విజయ సునీతకు వినతిపత్రం అందజేస్తున్న ఏఎంసీ చైర్మన్ రమేష్

సూళ్లూరుపేట, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): వ్యవసాయశాఖ మార్కెటింగ్ యార్డు అభివృద్ధికి సహకరించాని రాష్ట్ర వ్యవసాయశాఖ మార్కెటింగ్ డైరెక్టర్ విజయ సునీతను ఏఎంసీ చైర్మన్ ఆకుతోట రమేష్ కోరారు. గుంటూరు కార్యాలయంలో ఆమెను మర్యాదపూర్వకంగా కలిశారు. మార్కెటింగ్ యార్డు అభివృద్ధికి సంబంధించి పలు విషయాలను ఆమె దృష్టికి తీసుకెళ్లారు. సీసీ రోడ్లు లేవని, కార్యాలయంలో తగినంత సిబ్బంది లేరని, దొరవారిసత్రం మండలం ఏకొల్లులో ప్రభుత్వం కేటాయించిన భూమిలో గోదాలు నిర్మాణానికి సహకరించాలని వినతిపత్రం అందజేశారు. ఆయనతో పాటు దొరవారిసత్రం, ఓజిలి మండలాల టీడీపీ అధ్యక్షులు శ్రీనివాసుల నాయుడు, విజయకుమార్ నాయుడు ఉన్నారు.

ప్రజా దర్బార్‌లో అర్జీల స్వీకరణ


అర్జీని పరిశీలిస్తున్న కురుగొండ్ల రామకృష్ణ

బాలయపల్లి, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): ఏళ్ల తరబడి నెలకొన్న సమస్యల పరిష్కారానికే కూటమి ప్రభుత్వ ధ్యేయమని ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ అన్నారు. సోమవారం స్థానిక వెలుగు కార్యాలయ సమావేశ భవనంలో ఏర్పాటు చేసిన ప్రజాదర్బార్‌లో ఆయన ప్రజల నుంచి అర్జీలను స్వీకరించారు. 72 మంది తమ వినతులు అందజేశారు. వీటిలో రెవెన్యూపరంగా 32, అన్నదాత సుఖీభవకు సంబంధించి 19, పెన్షన్ల కోసం 21 అర్జీలు అందాయి. తహసీల్దార్ విజయలక్ష్మీ, ఎంపీడీవో నారాయణ, ఏఎంసీ చైర్మన్ పునుగోటి విశ్వనాథం, డీఆర్వో సుహాసిని, టీడీపీ మండల అధ్యక్షుడు రాయి సత్యనారాయణ, మస్తాన్‌నాయుడు, నాయకులు దాసరి ప్రభాకర్‌నాయుడు, రాజగోపాల్‌నాయుడు, సీసీ నాయుడు, నల్లబోతుల మురళి పాల్గొన్నారు.

సాగును లాభసాటిగా మార్చడమే లక్ష్యం


రైతులకు ప్రభుత్వ పథకాలు వివరిస్తున్న ఏవో వరప్రసాద్

పెళ్లకూరు, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): అధిక దిగుబడులు సాధించి వ్యవసాయాన్ని లాభసాటిగా మార్చడమే లక్ష్యమని నాయుడుపేట వ్యవసాయశాఖ ఏడీఏ డాక్టర్ ఎం నాగార్జునసాగర్ పేర్కొన్నారు. సోమవారం కొత్తూరులో నిర్వహించిన రైతన్నా మీకోసం కార్యక్రమంలో పాల్గొన్ని మాట్లాడారు.. రైతులు లాభదాయకమైన ఆధునిక వ్యవసాయ పద్ధతులను పాటించాలని ఆయన సూచించారు. జీలపాటూరులో నిర్వహించిన కార్యక్రమంలో ఉమ్మడి నెల్లూరు జిల్లా సర్పంచుల సంఘం అధ్యక్షుడు కందమూడి శివకుమార్ పాల్గొన్నారు. కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారి విజయభారతి, ఏఈవోలు పుట్టయ్య, అశోక్ తదితరులు ఉన్నారు. **ఓజిలి** : పున్నేపల్లిలో రైతన్నా-మీకోసం కార్యక్రమాన్ని మండల ఏవో వరప్రసాద్ పర్యవేక్షించారు. ఇంటింటికి వెళ్ళి రైతులతో మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం రైతుల కోసం ప్రవేశపెట్టిన పథకాలను వివరించారు. ఏఈఓ డెన్‌దీప్, వెటర్నరీ సహాయకులు షమీరా, ఇంజనీరింగ్ సహాయకులు పవిత్ర, వీఆర్వో డిల్లయ్య ప్రకృతి వ్యసాయం సిబ్బంది రైతులు పాల్గొన్నారు. **వాకాడు** : ఈనెల 29 వరకు సచివాలయ సిబ్బంది రైతులను కలిసి వ్యవసాయ సంక్షేమ కార్యక్రమాలను వివరిస్తారని వ్యవసాయ అధికారి దీప తెలిపారు. సోమవారం ఆమె వాకాడు సచివాలయ పరిధిలో ఉన్న రైతులకు కరపత్రాలను అందజేశారు.

రైతు సంక్షేమానికి అగ్రాసనం

కోట, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి) : రైతులకు ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని టీడీపీ నాయకులు చెప్పారు. కొక్కుపాడులో సోమవారం టీడీపీ నాయకులు ఇంటింటా తిరిగి అన్నదాత సుఖీభవ కరపత్రాలను పంపిణీ చేశారు. సీఎం చంద్రబాబునాయుడు రైతుల పక్షపాతిగా సాహసోపేతమైన పథకాలు ప్రవేశపెట్టి దేశంలోనే ఆంధ్రప్రదేశ్‌ను మొదటి స్థానంలో నిలుపుతున్నారన్నారు. మండల టీడీపీ అధ్యక్షుడు పలగాటి భాస్కర్‌రెడ్డి, మైనార్టీ సెల్ జిల్లా అధ్యక్షుడు షేక్ జలీల్ అహ్మద్, ఏఎంసీ చైర్మన్ మర్రిప్రమీల, మోహన్‌రెడ్డి, తదితరులు ఉన్నారు.

సేవాగుణం అలవర్చుకోవాలి



మాట్లాడుతున్న చైతన్య, శ్యామ్ కుమార్, ఎంఈవో

సూళ్లూరుపేట, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు చదువుతో పాటు సమాజం పట్ల బాధ్యత, సేవాభావం అలవర్చుకోవాలని ఎన్ఎస్ఎస్ అధికారి చైతన్య అన్నారు. సోమవారం ఎన్ఎస్ఎస్ దినోత్సవం సందర్భంగా జూనియర్ కళాశాల ఎన్ఎస్ఎస్ విద్యార్థి విభాగం ఆధ్వర్యంలో మన్నారు పోలూరు ప్రాథమిక పాఠశాలలోప్రత్యేక శిబిరం ప్రారంభించారు. శిబిరం ఏడు రోజుల పాటు జరుగుతుందని కళాశాల ప్రిన్సిపాల్ శ్యామ్‌కుమార్ తెలిపారు. ఇందులో భాగంగా పరిసరాలు శుభ్రత, సీజనల్ వ్యాధుల నివారణ చర్యల గురించి ఎన్ఎస్ఎస్ విద్యార్థులు వివరించారు. అనంతరం పరిసరాలను పిచ్చిమొక్కలు తొలిగించి పరిసరాలను శుభ్రం చేశారు. తడ మండలం కారిజాత లో ప్రిన్సిపాల్ ఎస్ఎల్‌బి శంకర్ శర్మ ఆధ్వర్యంలో ప్రత్యేక క్యాంపు నిర్వహించారు. కార్యక్రమంలో ఎంఈవో సునీలా, ఆర్‌కే ఫౌండేషన్ నిర్వాహకులు రజనీకాంత్ పాల్గొన్నారు.

గోతుల రోడ్లను బాగు చేయాలి

బాలయపల్లి, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): బంగారుపేట నుంచి బాలయపల్లి పిగిలాం హస్తకావేరి గ్రామాలకు వెళ్లే రోడ్లు గుంతలమయంగా తయారయ్యాయి. దీంతో వాహనచోదకులు, పాదచారులు ఇబ్బందులు పడుతున్నారని సీపీఐ నియోజకవర్గ ప్రధాన కార్యదర్శి బాలకృష్ణ, చిన్న పెంచలయ్య అన్నారు. సోమవారం సీపీఐ నాయకులు స్థానికులతో కలసి రోడ్లను పరిశీలించారు. ప్రజాప్రతినిధులు, అధికారులు స్పందించి బాగు చేయాలని వారు కోరారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తం

కోట, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి) : వర్షాల నేపథ్యంలో చిన్నారులకు జ్వరాలు వంటి సీజనల్ వ్యాధులు వచ్చే అవకాశం ఉందని సీడీపీవో మునికుమారి చెప్పారు. అంగన్‌వాడీ వర్కర్, హెల్పర్‌లు తగు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. వెంకన్నపాళెం, తిమ్మానాయుడుపాళెం, వంజివాక అంగన్‌వాడీ కేంద్రాలను సోమవారం ఆమె తనిఖీ చేశారు. ఈ సందర్భంగా చిన్నారులకు అందిస్తున్న పౌష్టికాహారాన్ని పరిశీలించారు. కాచిచల్లార్చిన నీటిని చిన్నారులకు ఇవ్వాలన్నారు. లోపాలు జరిగితే శాఖాపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

వ్యవసాయ పథకాలపై శిక్షణ

కోట, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి) మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం రైతన్నా మీకోసం వారోత్సవాలకు సంబంధించి సిబ్బందికి శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా ఎంపీడీవో దిలీప్‌కుమార్ నాయక్ మాట్లాడుతూ మండలంలోని 13 రైతు సేవాకేంద్రాల పరిధిలో 9 కుటుంబాలను ప్రతి యూనిట్‌గా తీసుకొని అధికార బృందాలు అవగాహన కల్పిస్తాయన్నారు. రైతులకు ప్రభుత్వం మంజూరు చేస్తున్న సంక్షేమ పథకాలు, అర్హత తదితర అంశాలపై ఇంటింటా ప్రచారం చేస్తారన్నారు. సమావేశంలో ఏవో సుచేంద్రప్రసాద్, ఎఫ్‌బీవో రెడ్యానాయక్ పలువురు టీడీపీ నాయకులు ఉన్నారు.

తెలుగు భాష పరిరక్షణకు కృషి చేయండి

తిరుపతి అర్బన్, నవంబరు 24(ఆంధ్రజ్యోతి): పబ్లిక్ రిలేషన్స్ సొసైటీ ఆఫ్ ఇండియా(పీఆర్‌ఎస్‌ఐ) ఆధ్వర్యంలో సమాజాన్ని చైతన్యపరిచేలా, అంతరించిపోతున్న తెలుగు భాషను పరిరక్షించేలా కార్యక్రమాలు నిర్వహించాలని ఏపీ తెలుగు, సంస్కృత అకాడమీ చైర్మన్ ఆర్డీ విల్సన్ (శరత్‌చంద్ర) కోరారు. పీఆర్‌ఎస్‌ఐ తిరుపతి చాప్టర్ కార్యవర్గం సోమవారం పద్మావతి వర్సిటీ సావేరి విశ్రాంతి గృహంలో ఆయన్ను కలిసి సన్మానించింది. చాప్టర్ చైర్మన్ జి.ప్రసాద్ మాట్లాడుతూ తెలుగు భాష పరిరక్షణకు అకాడమీ తరఫున కార్యక్రమాలు నిర్వహించేందుకు సంస్థ సిద్ధంగా ఉందన్నారు. కార్యక్రమంలో పీఆర్‌ఎస్‌ఐ తిరుపతి చాప్టర్ వైస్ చైర్మన్ ఆచార్య ఎన్.రజని, కార్యదర్శి దుద్యాల చంద్రమోహన్, కోశాధికారి కె.మధుసూదన్, ఆర్వీ కృష్ణస్వామిరాజు, త్రిపురసుందరి, రవీంద్ర పాల్గొన్నారు.

క్వారీకి అనుమతులు వద్దు


వినతిపత్రం అందజేస్తున్న సర్పంచ్ చెంగమ్మ

కేవీబీపురం, నవంబరు 24(ఆంధ్రజ్యోతి): తమ గ్రామాల పరిధిలో సాయిశక్తి ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ కార్వీ అనుమతులను రద్దు చేయాలని సోమవారం పూడి గ్రామాల ప్రజలు తహసీల్దారు కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. సుమారుగా 700 కుటుంబాలు, 2వేల మందికి పైగా జనాభా ఉన్న తమ గ్రామాల్లో క్రషర్, క్వారీ అంటూ భారీ వాహనాలతో ప్రైవేటు వ్యక్తులు వస్తున్నారన్నారు. సర్వే నెం.425, 279లో ఉన్న కొండభూమిని కొనుగోలు చేశామని చెబుతున్నారన్నారు. అయితే సుమారు 14వందల హెక్టార్లలో రైతులు వరి, వేరుశనగ, మామిడితోటలను సాగు చేస్తున్నామని తెలిపారు. గ్రామంలో క్వారీకి అనుమతులు ఇవ్వొద్దని తహసీల్దారు రోశయ్యకు పూడి, ఎగువపూడి, పూడి సీకేపురం, దిగువపూడి, పోలినాయుడుకండ్రిగ, వడ్డిపాళెంవాసులు వినతిపత్రం అందజేశారు. సర్పంచ్ చెంగమ్మ, బాలకృష్ణరాజు, సురేష్, రాధయ్య, సుబ్రహ్మణ్యం, చంద్రయ్య, రమేష్, మునిరత్నంశెట్టి పాల్గొన్నారు. కాగా సోమవారం ఉదయం భారీ వాహనాలతో సంస్థ నిర్వాహకులు అనుమతి ఇచ్చారంటూ క్వారీ వద్దకు రాగా గ్రామస్తులు అడ్డుకుని వెనక్కు పంపారు.

ఉపాధిహామీ బకాయిలను చెల్లించండి


కలెక్టర్ కార్యాలయం ఎదుట కూలీల ధర్నా

నాగలాపురం, నవంబరు 24(ఆంధ్రజ్యోతి): గ్రామీణ ఉపాధిహామీ పథకంలో పెండింగ్‌లో ఉన్న పది వారాల బిల్లులను తక్షణమే చెల్లించాలని ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి దాసరి జనార్దన్ డిమాండ్ చేశారు. సోమవారం ఆయన కలెక్టర్ కార్యాలయం ఎదుట నాగలాపురం, పుత్తూరు, వెంకటగిరి, కేవీబీపురం మండలాల వ్యవసాయ కూలీలతో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆగస్టు నుంచి చేసిన పనికి బిల్లులు చెల్లించకుండా ప్రభుత్వం కూలీలను ఇబ్బంది పెడుతోందన్నారు. చట్టంలో 14 రోజులకు మించి బకాయిలు ఉండకూడదని ఉన్నప్పటికీ అధికారులు పాటించకపోవడం దారుణమన్నారు. ఒక్క నాగలాపురం మండలంలోనే రూ. కోటీ 50 లక్షల బకాయిలు ఉన్నాయని తెలిపారు. అముద, మురగేష్, దినమణి తదితరులు పాల్గొన్నారు.

విద్యుదాఘాతంతో రెండు ఎద్దుల మృతి



కేవీబీపురం, నవంబరు 24(ఆంధ్రజ్యోతి): మండలంలోని పెరిందేశానికి చెందిన తలారి మురగయ్యకు చెందిన రెండు ఎద్దులు విద్యుదాఘాతంతో మృతి చెందాయి. మురగయ్య మధ్యాహ్నం ఎద్దులను మేత కోసం వదలగా అవి ట్రాన్స్‌ఫార్మర్‌కు అమర్చిన వైర్ల సమీపంలో మేస్తుండగా విద్యుదాఘాతానికి గురై మృతి చెందాయి. సమాచారం అందుకున్న పశువైద్యాధికారి సంఘటనా స్థలానికి చేరుకుని కళేబరాలకు పోస్టుమార్టం నిర్వహించారు.

పుత్తూరు వార్తలు

రైతులను అన్ని విధాలా ఆదుకుంటాం


ఎస్వీపురంలో రైతులకు కరపత్రాలందిస్తున్న నాయకులు

వడమాలపేట, నవంబరు 24(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం అన్నదాతల కోసం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను వివరిస్తూ రైతులకు కరపత్రాలను టీడీపీ నాయకులు అందజేశారు. సోమవారం రైతన్నా మీకోసంలో భాగంగా మండలంలోని టీసీ అగ్రహారం, ఎస్వీపురం, వడమాలల్లో వ్యవసాయ అధికారులు, టీడీపీ నాయకులు కరపత్రాలను రైతులకు అందజేశారు. అన్నదాత సుఖీభవ సహా వ్యవసాయ సంబంధిత ప్రభుత్వ సహకారం తదితరాలను 3,398 మంది రైతులకు అందించినట్లు ఏవో విజయ్‌కుమార్ చెప్పారు. టీడీపీ మండల అధ్యక్షుడు దాముయాదవ్, నాయకులు ధనంజయులు నాయుడు, శేషాద్రి యాదవ్, శివరాయల్, దాము, రవిరెడ్డి, చిరంజీవి, మురళి, శ్రీనివాసులు పాల్గొన్నారు.

పుత్తూరు టౌన్ (ఆంధ్రజ్యోతి): రైతన్నా మీకోసం కరపత్రాలను ఏడీఏ లక్ష్మీదేవి, ఏవో కోదండయ్య వేపగుంట పంచాయతీలో పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు ఇంటింటికీ వెళ్లి రైతులకు ప్రభుత్వం అందిస్తున్న వివిధ పథకాలను వివరించారు. అలాగే రైతుల సమస్యలను తెలుసుకుని, పరిష్కరిస్తామని తెలిపారు. పుత్తూరు మండల టీడీపీ అధ్యక్షుడు బాలాజీ, వీఏవో మురళి, వీఏఎస్ శ్రీదేవి, రామచంద్రారెడ్డి, ఇంజనీరింగ్ అసిస్టెంట్ అబ్దుల్ తదితరులు పాల్గొన్నారు.

పీజీఆర్ఎస్‌లో వినతుల స్వీకరణ


వినతిపత్రం స్వీకరిస్తున్న మున్సిపల్ కమిషనర్

పుత్తూరు అర్బన్, నవంబర్ 24(ఆంధ్రజ్యోతి): పుత్తూరు మున్సిపాలిటీ పరిధిలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను పీజీఆర్ఎస్ కార్యక్రమం ద్వారా మున్సిపల్ కమిషనర్ డి.వి.నాగేశ్వరరావు దృష్టికి తీసుకొచ్చారు. నందిమంగళంలో ముస్లింల శ్మశానవాటికలో మౌలిక సదుపాయాలు కల్పించాలని, 13వ వార్డులో శ్మశానవాటిక ప్రహరీ నిర్మించాలని కోరారు. పట్టణ సర్వేయర్ వెంకటరమణకు ఈ ఫిర్యాదులను బదలాయించారు. నీటి సంరక్షణ ప్రాంతాల్లో శ్మశానాలు ఉన్నాయని, మున్సిపల్ ఆధ్వర్యంలో సదుపాయాలు కల్పించలేమని వారికి వివరించారు. కోనేటిపాళెం, ఎన్టీఆర్ కాలనీల్లో రోడ్లు, డ్రైనేజీ సమస్యలతో పాటు వీధి లైట్లు వెలగడం లేదని విన్నవించారు. లే అవుట్‌లో ఇబ్బంది ఉందని చెప్పగా, అనుమతులు ఉన్నాయా అని ప్రశ్నించగా అవేమీ లేవన్నారు. పరిశీలించి సమస్య పరిష్కారానికి కృషి చేస్తామని ఆయన తెలిపారు. జెండామాను ఎక్స్‌టెన్షన్ వీధిలో కాలువ నీటిని రోడ్డుపై వదిలేస్తున్నారని, వీధి లైట్లు వెలగడం లేదని ఫిర్యాదు చేశారు. అప్పటికప్పుడు సిబ్బంది క్షేత్రస్థాయిలో పరిశీలించి వీధిలైట్లు వేయించారు. డ్రైనేజీ సమస్యను రెండు రోజుల్లో పరిష్కరిస్తామని తెలిపారు.

ఎన్ఎస్ఎస్ ప్రత్యేక శిబిరం



పుత్తూరు, నవంబరు 24(ఆంధ్రజ్యోతి): స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఎన్ఎస్ఎస్ వలంటీర్లు ఈనెల 24 నుంచి వారం రోజుల పాటు సి.టి.ఆర్.నెత్తం గ్రామంలో ప్రత్యేక శిబిరం నిర్వహిస్తున్నారని ప్రిన్సిపాల్ చంద్రమౌళి తెలిపారు. స్వచ్ఛభారత్, శుభ్రతపై అవగాహన కల్పిస్తారన్నారు. ఇలాంటి శిబిరాల్లో ప్రాతినిధ్యం వహిస్తే సేవాభావం, నాయకత్వ లక్షణాలు అలవడుతాయన్నారు. అనంతరం గ్రామంలో ఆరోగ్య అవగాహన ర్యాలీని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు కోటేశ్వరయ్య, శ్రీనివాసులు, బాబురావు, తిరుమలయ్య పాల్గొన్నారు.

మౌలిక వసతులు కల్పించండి

పుత్తూరు టౌన్, నవంబర్ 24(ఆంధ్రజ్యోతి): మున్సిపల్ పరిధిలోని జ్యోతిబసు నగర్‌లో మౌలిక వసతులు కల్పించాలని కలెక్టర్ సీపీఎం నాయకులు వినతిపత్రం అందించారు. 2008వ సంవత్సరం నుంచి అక్కడ పేదలు గుడిసెలు నిర్మించుకుని జీవనం సాగిస్తున్నరని, వారికి ఇంటి పట్టాలిచ్చి, మౌలిక వసతులు కల్పించాలని పేర్కొన్నారు. అలాగే గోపాలకృష్ణాపురం ఎస్టీకాలనీలో 50 సంవత్సరాలుగా అనుభవంలో ఉన్న భూములను ఆక్రమించుకోవడం దారుణమని, న్యాయం చేయాలని కోరారు. వెంకటేష్, నందయ్య, రాఘవమ్మ, నాగభూషణం, లీలావతి తదితరులు పాల్గొన్నారు.

పౌష్టికాహారంతో శారీరక వృద్ధి

పుత్తూరు టౌన్, నవంబర్ 24(ఆంధ్రజ్యోతి): పౌష్టికాహారంతో శరీరం వృద్ధి చెందడంతోపాటు మానసిక ఎదుగుదల ఉంటుందని విజయవాహిని చారిటబుల్ ఫౌండేషన్, టాటా ట్రస్ట్ ప్రోగ్రాం అసోసియేట్ సంతోషి తెలిపారు. సోమవారం ఇక్కడి సీడీపీవో కార్యాలయంలో అంగన్‌వాడీ సహాయకులకు టార్గెటెడ్ ఫుడ్ ఫోర్టిఫికేషన్‌పై శిక్షణ ఇచ్చారు. పౌష్టికాహార లోపం, దాని ప్రభావాలపై అవగాహన కల్పించారు.

శ్రీకాళహస్తి
సత్యవేడు

డిజిటల్ వేయింగ్ మెషిన్ల వితరణ

పిచ్చాటూరు, నవంబరు 24(ఆంధ్రజ్యోతి): పిచ్చాటూరు ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధిలోని అంగన్‌వాడీ కేంద్రాలకు సోమవారం స్థానిక కార్యాలయం వద్ద విజయవాహిని చారిటబుల్ ఫౌండేషన్, టాటా ట్రస్టు ప్రతినిధి రామకృష్ణ డిజిటల్ వేయింగ్ మెషిన్లను పంపిణీ చేశారు. సీడీపీవో సౌభాగ్యమ్మ, సూపర్‌వైజర్లు, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

రెండున్నరేళ్లకే గుంతలు తేలిన నిర్మిత కాలనీ రోడ్డు



శ్రీకాళహస్తి, నవంబరు 24(ఆంధ్రజ్యోతి): ఈ చిత్రాలనుచూడండి. సరిగ్గా రెండున్నర ఏళ్లక్రితం వైసీపీ పాలనలో నిర్మించిన రోడ్డు అనతికాలంలోనే దుస్థితికి చేరుకున్న దృశ్యాలు ఇవీ. శ్రీకాళహస్తీశ్వరాలయ సమీపంలోని టూరిస్టు బస్టాండు నుంచి నిర్మిత కాలనీ వద్దఉన్న వేదాంరోడ్డు వరకు 2023 మార్చిలో సీసీరోడ్డును నిర్మించారు. అప్పట్లో రోడ్డు వేసిన రెండు రోజులకే కంకర తేలిపోవడంతో ఆంధ్రజ్యోతిలో ఇదేం నాణ్యత అన్న శీర్షికతో కథనం ప్రచురితమైంది. దాంతో అధికారులు కంకర తేలిచ చోట తారుతో కప్పారు. అయితే ఇటీవల ఈ రోడ్డుపై పలుచోట్ల గుంతలు తేలిపోయాయి. దాంతో ఈమార్గంలో వెళ్లే ప్రయాణికులంతా ఇదేం చోద్యమంటూ విస్మయం వ్యక్తం చేస్తున్నారు. సంబంధితఅధికారులు స్పందించి ఈ మార్గంలో రోడ్డును బాగుచేయాలనికోరుతున్నారు.

రైతులు నిజమైన సంరక్షకులు

పల్లెపల్లెనా రైతన్నా మీకోసం




అక్కుర్తిలో రైతులకు కరపత్రాలను అందజేస్తున్న చెంచయ్యనాయుడు తదితరులు - కాటూరు, ఏర్పేడులో రైతులకు ప్రభుత్వ పథకాలను వివరిస్తున్న టీడీపీ నాయకులు, అధికారులు

శ్రీకాళహస్తి, నవంబరు 24(ఆంధ్రజ్యోతి): రైతులు నిజమైన సంరక్షకులని శ్రీకాళహస్తి వ్యవసాయ మార్కెట్ కమిటీ ఛైర్మన్ రంగినేని చెంచయ్యనాయుడు అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన రైతన్నా మీకోసం పంచ సూత్రాల కార్యక్రమంలో భాగంగా సోమవారం అక్కుర్తి సచివాలయ పరిధిలో అధికారులతో కలిసి టీడీపీ నాయకులు రైతులకు అవగాహన కల్పించారు. వ్యవసాయ, ఉద్యాన, పశుసంవర్థక, మత్స్యకార రంగాలు రాష్ట్ర జీడీపీకి 35శాతం అందిస్తూ ఆర్థిక వ్యవస్థను ముందుకు నడిపిస్తున్నాయన్నారు. రానున్న ఐదు సంవత్సరాల్లో రైతును రాజును చేసేందుకు ఐదు విధానాలతో కార్యాచరణ ప్రభుత్వం అమలు చేస్తుందన్నారు. రైతులకు ఏవైనా సమస్యలు ఉంటే తమ దృష్టికి తీసుకువస్తే అధికారులతో మాట్లాడి పరిష్కరిస్తామన్నారు. టీడీపీ మండల అధ్యక్షుడు అక్కింతల కృష్ణయాదవ్, కాపుగున్నేరి పీఏసీఎస్ ఛైర్మన్ బత్తిరెడ్డి, నాయకులు కామేష్‌యాదవ్, జగన్నాథంనాయుడు, రమేష్, జగదీష్‌రెడ్డి, అధికారులు రమేష్‌రెడ్డి, సురేంద్రరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

● తొట్టంబేడు మండలంలో కూడా రైతన్నా మీ కోసం కార్యక్రమాన్ని నిర్వహించారు. వ్యవసాయశాఖాధికారులు, టీడీపీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

బుచ్చినాయుడుకండ్రిగ (ఆంధ్రజ్యోతి): మండలంలోని కాటూరులో రైతన్నా మీకోసం కార్యక్రమాన్ని ఏఎంసీ ఛైర్మన్ జ్యోతి, టీడీపీ మండల అధ్యక్షుడు సుధాకర్‌నాయుడు, తహసీల్దార్ శ్రీదేవి ఆధ్వర్యంలో నిర్వహించారు. కాటూరు సహకార సంఘం ఛైర్మన్ భాస్కర్‌యాదవ్, ఎంపీడీవో వెంకటరత్నమ్మ, టీడీపీ నాయకులు శశియాదవ్, శ్రీనివాసులు, పరుశురామ్ తదితరులు పాల్గొన్నారు.

వరదయ్యపాళెం (ఆంధ్రజ్యోతి): మండలంలోని సీఎల్ఎన్‌పల్లి పంచాయతీలో లక్ష్మీపురంలో సోమవారం రైతన్నా మీ కోసం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఇన్‌ఛార్జి వ్యవసాయాధికారి ప్రవీణ, అగ్రికల్చర్ అసిస్టెంట్ ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

సత్యవేడు (ఆంధ్రజ్యోతి): అన్నదాత శ్రేయస్సుకే రైతన్నా మీ కోసం కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు సత్యవేడు ఏవో మురళి తెలిపారు. మండలంలోని రాజగోపాలపురం, కొత్తమారి కుప్పం, పుదుకుప్పం, ఇరుగుళం, మదనంబేడు గ్రామాల్లో సోమవారం ఏవో ఆధ్వర్యంలో రైతన్నా మీ కోసం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏవో మాట్లాడుతూ వ్యవసాయం, అనుబంధ రంగాల్లో సగటున సంవత్సరానికి 15 శాతం వృద్ధి రేటు సాధించాలన్నదే ప్రభుత్వ లక్ష్యమన్నారు. అందుకనుగుణంగా వ్యవసాయ శాఖ ప్రణాళికలతో ముందుకు వెళ్తున్నట్లు తెలిపారు. వ్యవసాయ, ఉద్యాన అనుబంధ పథకాలపై రైతులకు వివరించారు. కార్యక్రమంలో రైతులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఏర్పేడు (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఆమందూరు, కొత్తవీరాపురం, ఏర్పేడుల్లో టీడీపీ నాయకులు అన్నదాత సుఖీభవ, పీఎం కిసాన్‌కు సంబంధించి రాష్ట్రప్రభుత్వం పంపించిన లేఖలను రైతులకు అందజేశారు. ఈ సందర్భంగా టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి గురవారెడ్డి, టీడీపీ మండల అధ్యక్షుడు నాగరాజునాయుడు, సూరినాయుడు, గాలి కృష్ణవేణి, కుక్క రమణయ్య, గుణయాదవ్, సుబ్రహ్మణ్యం, తదితరులు పాల్గొన్నారు.

ముక్కంటి సేవలో ఎమ్మెల్సీ గ్రీష్మ



శ్రీకాళహస్తి, నవంబరు24(ఆంధ్రజ్యోతి): జ్ఞానప్రసూనాంబ సమేత శ్రీకాళహస్తీశ్వరుడిని సోమవారం ఎమ్మెల్సీ కావలి గ్రీష్మ, మాజీ స్పీకర్ ప్రతిభాభారతి కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. ఆలయ అధికారులు వారికి స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు. వారుముందుగా ప్రత్యేక రాహుకేతు సర్పదోష నివారణ పూజలను చేయించుకున్నారు. అనంతరం స్వామిఅమ్మవార్లను దర్శించుకున్నారు. మృత్యుంజయ స్వామి సన్నిధి వద్ద వేదపండితులు వారిని ఆశీర్వదించి స్వామి అమ్మవార్ల జ్ఞాపిక, తీర్థప్రసాదాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

బాధితులకు అండగా ఉంటాం


చెక్కుల పంపిణీలో ఆదిమూలం తదితరులు

నారాయణవనం/ పిచ్చాటూరు, నవంబర్ 24(ఆంధ్రజ్యోతి): బాధితులను ఆదుకోవడమే లక్ష్యంగా పనిచేస్తానని ఎమ్మెల్యే ఆదిమూలం చెప్పారు. సోమవారం సాయంత్రం ఎమ్మెల్యే నివాసంలో నియోజకవర్గ పరిధిలోని 11 మంది బాధితులకు రూ.7,69,611 సీఎం సహాయ నిధి చెక్కులను పంపిణీ చేశారు. భాస్కర్(పిచ్చాటూరు) రూ.13,000, ఆండాలమ్మ(పిచ్చాటూరు) రూ.62,000, ఆర్ముగం ఏకాంబరకుప్పం(రామగిరి) రూ.23,000, మన్నాసిరాజు(పులికుండ్రం) రూ.82,000 అందించారు. ఇళంగోవన్‌రెడ్డి, వాసురెడ్డి, రమేష్, నరేష్ తదితరులు పాల్గొన్నారు.

అందెశ్రీకి నివాళి



శ్రీకాళహస్తి, నవంబరు 24(ఆంధ్రజ్యోతి): ప్రజా కవి అందెశ్రీకి ధూర్జటి రసజ్ఞ సమాఖ్య సాహితీ కళావేదిక ఆధ్వర్యంలో సోమవారం నివాళులర్పించారు. పట్టణంలోని జడ్పీ బాలుర ఉన్నత పాఠశాలలో అందెశ్రీ సంస్మరణ దినాన్ని నిర్వహించారు. హెచ్ఎం తీగల వెంకటయ్య మాట్లాడుతూ... సాహితీలోకానికి చేసిన అందెశ్రీ సేవలను కొనియాడారు. పులి రాధాకృష్ణయ్య, గురునాథం, మునిసుబ్బారెడ్డి, షణ్ముగం, రవీంద్ర, మునస్వామి, పులి భారతి, శేషగిరిరావు తదితరులు పాల్గొన్నారు.

పరశురామేశ్వరుడి సేవలో పలమనేరు విద్యార్థులు



ఏర్పేడు, నవంబరు 24(ఆంధ్రజ్యోతి): మండలంలోని గుడిమల్లంలో వెలసిన పరశురామేశ్వర స్వామిని సోమవారం పలమనేరు జడ్పీ ఉన్నత పాఠశాలకు చెందిన 9, 10వ తరగతి విద్యార్థులు దర్శించుకున్నారు. సుమారు వందమంది విద్యార్థులు గుడిమల్లం ఆలయాన్ని సందర్శించి స్వామిఅమ్మవార్ల సేవలో పాల్గొన్నారు. వారికి ఆలయ అధికారులు స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు. అనంతరం ఆలయ చరిత్రను వివరించారు.

బార్ అసోసియేషన్ అధ్యక్షుడిగా వెంకటేశ్వర్లు



శ్రీకాళహస్తి, నవంబరు 24(ఆంధ్రజ్యోతి): శ్రీకాళహస్తి బార్ అసోసియేషన్ ఎన్నిక సోమవారం జరిగింది. అధ్యక్షుడిగా పూడి వెంకటేశ్వర్లు, ఉపాధ్యక్షుడిగా మల్లికార్జునయ్య, కార్యదర్శిగా తులసి, సంయుక్త కార్యదర్శిగా కె.ఎం. నాగరాజ్, కోశాధికారిగా మునిశేఖర్, మహిళా ప్రతినిధిగా సునీత, ఎగ్జిక్యూటివ్ సభ్యులుగా సంతోష్‌కుమార్, కిరణ్‌కుమార్, మీర్జావతి ఎన్నికయ్యారు. ఎన్నికల అధికారి వారికి నియామక పత్రాలు అందజేశారు. అనంతరం వారు న్యాయమూర్తులను మర్యాదపూర్వకంగా కలిశారు.

చికెన్ వ్యర్థాలు తరలిస్తున్న వాహనం బోల్తా



ఏర్పేడు, నవంబరు 24(ఆంధ్రజ్యోతి): ఏర్పేడు-వెంకటగిరి మార్గంలోని చింతలపాళెం వంతెన సమీపంలో చికెన్ వ్యర్థాలు తరలిస్తున్న వాహనం రోడ్డు పక్కన బోల్తా పడింది. వ్యర్థాలు నీటిలో కలిసిపోవడంతో దుర్గంధం వెదజల్లింది. ఈ ఘటనలో ఎవరూ గాయపడలేదు.

పార్టీ బలోపేతమే లక్ష్యంగా పనిచేయండి

శ్రీకాళహస్తి, నవంబరు 24(ఆంధ్రజ్యోతి): నియోజకవర్గంలో పార్టీ బలోపేతమే లక్ష్యంగా పనిచేయాలని ఏఐసీసీ పరిశీలకురాలు, ఎంపీ సుధా రాధాకృష్ణన్ దిశానిర్దేశం చేశారు. శ్రీకాళహస్తిలో డీసీసీ అధ్యక్షుడు బాలగురవం బాబు అధ్యక్షతన, నియోజకవర్గ సమన్వయకర్త తలపా రామచంద్రారెడ్డి ఆధ్వర్యంలో జరిగిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ గ్రామస్థాయి నుంచి బూత్‌స్థాయి వరకు పార్టీ శ్రేణులు క్రమశిక్షణతో పని చేయాలన్నారు. మదన్‌మోహన్‌రెడ్డి, తమటం వెంకట నరసింహులు, కలిందర్, శబరి రాజన్‌రెడ్డి, మురళి, సురేంద్రరెడ్డి పాల్గొన్నారు.

మల్లిమడుగు డ్యాంకు భారీగా చేరుతున్న నీరు

రేణిగుంట, నవంబరు 24(ఆంధ్రజ్యోతి): ఇటీవల కురుస్తున్న వర్షాలకు మల్లిమడుగు డ్యాంకు భారీగా నీరు చేరుతోంది. సోమవారం తిరుమలలోని గోగర్భం, పాపవినాశనంలు నిండడంతో ఈ రెండు డ్యాంలకు చెందిన 4 గేట్లనుంచి నీటిని దిగువకు విడుదల చేయడంతో మల్లిమడుగు సిబ్బంది అప్రమత్తమయ్యారు. ప్రస్తుతానికి డ్యాం పూర్తి స్థాయిలో ఉండగా కొండపై నుంచి వచ్చే నీటితో రెండు మీటర్లు పెరిగే అవకాశం ఉందని డీఈ చంద్రమౌళి తెలిపారు. రాత్రి రెండు గేట్లను అర అంగుళం పైకి ఎత్తి నీటిని కిందకు విడుదల చేస్తామని తెలిపారు.

వృద్ధురాలి ఆత్మహత్య

సత్యవేడు, నవంబరు 24(ఆంధ్రజ్యోతి): జీవితంపై విరక్తి చెందిన వృద్ధురాలు బలవన్మరణానికి పాల్పడింది. సత్యవేడు ఎస్ఐ రామస్వామి తెలిపిన వివరాలు... స్థానిక గంగమిట్టకి చెందిన రాజేశ్వరి(70) ఒంటరిగా ఉంటూ పట్టణంలో పండ్లు విక్రయిస్తూ జీవనం సాగిస్తోంది. రాజేశ్వరికి సంతానం లేకపోవడంతో పాటు భర్త కూడా ఇది వరకే మరణించాడు. కొంత కాలంగా అనారోగ్యంతో ఇబ్బందులు పడుతూ వచ్చింది. ఈ నేపథ్యంలో జీవితంపై విరక్తి చెంది ఆదివారం రాత్రి ఉరివేసుకుంది. రాజేశ్వరి అక్క కుమారుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిర్వహించిన అనంతరం బంధువులకు అప్పగించారు.

మృత్యుంజయుడికి వేదోక్తంగా పూజలు



శ్రీకాళహస్తి, నవంబరు 24(ఆంధ్రజ్యోతి): శ్రీకాళహస్తీశ్వరాలయంలో కొలువై ఉన్న మృత్యుంజయుడికి సోమవారాన్ని పురస్కరించుకుని వేదోక్తంగా పూజలు నిర్వహించారు. ముందుగా వినాయకుడిని సుగంధద్రవ్యాలతో అభిషేకించారు. అనంతరం మృత్యుంజయుడికి పాలు, పంచామృతం, చందనం, విభూది, పచ్చకర్పూరంతో అభిషేకాలు జరిపి గజమాల, వెండి నాగాభరణంతో అలంకరించి భక్తులకు దర్శనం కల్పించారు.

విద్యార్థులకు నాణ్యమైన భోజనం పెట్టాలి

బుచ్చినాయుడుకండ్రిగ, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులకు నాణ్యమైన భోజనం పెట్టాలని ఎంఈవో రవీంద్రనాథ్ ఆదేశించారు. మండలంలోని మొక్కలచేను గిరిజన కాలనీలోని ప్రాథమిక పాఠశాలలో మధ్యాహ్న భోజనాన్ని సోమవారం ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా వంట నిర్వాహకులకు సూచనలు చేశారు. అనంతరం విద్యార్థుల చదువులపై ఆరా తీశారు.

ఘనంగా జీవపరిణామ దినం

రేణిగుంట నవంబర్ 24 (ఆంధ్రజ్యోతి): జీవ పరిణామ దినాన్ని జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. సోమవారం పట్టణంలోని జడ్పీ బాలికలు, బాలుర పాఠశాలల్లో చార్లెస్ డార్విన్ రచించిన జీవజాతుల పుట్టుక గ్రంథం ద్వారా జీవపరిణామక్రమ సిద్ధాంతం ప్రపంచానికి అందించిన రోజును పురస్కరించుకొని వేడుకలను నిర్వహించారు. జీవపరిణామ గ్రంథంలోని అంశాలను విద్యార్థిని విద్యార్థులకు వివరించారు. ఈ కార్యక్రమంలో జేవీవీ జిల్లా ఉపాధ్యక్షుడు వెంకటరమణ, మండల కార్యదర్శి కుప్పుస్వామి, సైన్స్ ఉపాధ్యాయురాలు శిరీష పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కేంద్రం తనిఖీ

శ్రీకాళహస్తి, నవంబరు 24(ఆంధ్రజ్యోతి): మండలంలోని పాపనపల్లి అంగన్‌వాడీ కేంద్రాన్ని సోమవారం స్త్రీ, శిశు సంక్షేమశాఖ గ్రేడ్ వన్ సూపర్‌వైజర్ ప్రియాంక తనిఖీ చేశారు. చిన్నపిల్లల హాజరు, గర్భిణిలు, బాలింతలకు పౌష్టికాహార పంపిణీ, పిల్లలకు మధ్యాహ్నం భోజనాన్ని పరిశీలించారు. పిల్లల వ్యక్తిగత పరిశుభ్రతను పరిశీలించి ఆహ్లాదకరమైన వాతావరణాన్ని కల్పించాలని సూచించారు. సులభరీతిలో పిల్లలకు బోధించాలన్నారు.